
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కర్నూలు జిల్లా వార్తలు 5
శుక్రవారం 6 సెప్టెంబరు 2024



వైసీపీకి యంత్రసేవ



కర్నూలు(అగ్రికల్చర్), సెప్టెంబరు 5: గత ప్రభుత్వం అమలు చేసిన వైఎస్సార్ యంత్ర సేవ పథకం ఆ పార్టీ సేవగా మారిందనే ఆరోపణలు ఉన్నాయి. ఈ పథకం కింద పెద్ద ఎత్తున నిధుల దుర్వినియోగం, యంత్ర పరికరాలు పక్కదారి పట్టడం తదితర ఫిర్యాదులు వస్తుండటంతో వెంటనే విచారణ జరిపించాలని ప్రస్తుత టీడీపీ ప్రభుత్వం నిర్ణయించింది. థర్డ్ పార్టీ అధికారుల బృందాలు గ్రామాలకెళ్లి వైఎస్సార్ యంత్రసేవా కేంద్రాల్లో జరిగిన అక్రమాలను వెలికి తీసే పని ప్రారంభించారు. దీంతో అప్పట్లో ఈ పథకంలో అక్రమాలకు పాల్పడిన అధికారుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. ఆనాటి వైసీపీ నేతలకు తలొగ్గి కళ్లు మూసుకుని సంతకాలు పెట్టి, ఆ పార్టీ నాయకులకు, వారి అనుచరులకు లబ్ధి చేకూర్చిన వ్యవసాయాధికారులు ఈ వ్యవహారం తమ మెడకు ఎక్కడ చుట్టుకుంటుందోనని ఆందోళన చెందుతున్నారు.

ఉమ్మడి కర్నూలు జిల్లాలో గత ప్రభుత్వం 877 రైతుభరోసా కేంద్రాలను ఏర్పాటు చేసింది. ఒక్కో రైతుభరోసా కేంద్రంలో నాలుగు నుంచి ఐదుగురు రైతులతో సంఘాన్ని ఏర్పాటు చేసి ఒక్కో సంఘానికి రూ.15 లక్షలు విలువ చేసే ట్రాక్టరుతో పాటు ఇతర పరికరాలను అందించే పథకానికి 2022లో నాటి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఈ పథకంలో ఒక యూనిట్ విలువ రూ.15 లక్షలు కాగా, అందులో పది శాతం మొత్తాన్ని రైతులు భరించాలి. 50 శాతం మొత్తాన్ని జిల్లా సహకార కేంద్ర బ్యాంకు అందించింది. మిగిలిన 40 శాతం మొత్తాన్ని ప్రభుత్వం రాయితీగా అందించింది. కర్నూలు జిల్లాలో రూ.16.26 కోట్ల రాయితీని 466 యంత్ర సేవా పరికరాలకు అందించారు. ఈ పథకం ద్వారా 1,765 మంది రైతులు లబ్ధి పొందారని వ్యవసాయ శాఖ అధికార వర్గాలు తెలిపాయి. అదే విధంగా నంద్యాల జిల్లాలో 408 యంత్ర సేవా కేంద్రాలు ఏర్పాటు చేసి రూ.15.74 కోట్ల రాయితీని ప్రభుత్వం అందించింది. 1,765 మంది లబ్ధి చేకూర్చినట్లు అధికారులు పేర్కొన్నారు. దాదాపు రూ.40 కోట్ల దాకా ఈ యంత్ర సేవా కేంద్రాలకు జిల్లా సహకార కేంద్ర బ్యాంకు రుణం అందించింది. ఇంత పెద్ద మొత్తంలో దాదాపు రూ.32 కోట్ల రాయితీని ప్రభుత్వం అందించిన అర్హులైన రైతులకు ప్రస్తుతం ఏ మాత్రం యంత్ర సేవా పరికరాలు అందరికీ అందుబాటులో లేకపోవడం బాధాకరం. కర్నూలు జిల్లాలో 466 యంత్ర సేవా కేంద్రాలు, నంద్యాల జిల్లాలో 408 యంత్ర సేవా కేంద్రాలు ఏర్పాటు చేస్తే ఆ కేంద్రాలోని ట్రాక్టర్లు, ఇతర పరికరాలు వైసీపీ నాయకుల సిఫారసు ఉన్న వారికే వినియోగంలో ఉండిపోవడం దారుణం. అత్యవసరమైన పొలం పనులు చేసుకునే రైతులకు యంత్ర పరికరాలు క్రమ పద్ధతిలో ముందుగా అందించాల్సి ఉంది. అయితే.. నిబంధనలకు పాతర వేసి ఆయా గ్రామాల్లో వైసీపీ నాయకులు సిఫారసు చేసిన వారికే యంత్ర సేవా కేంద్రాలను ముందుగా కట్టబెట్టారు. దీంతో ఇతర రైతులు మరో దారి లేక పెద్ద మొత్తంలో అద్దెకు ట్రాక్టర్లను తీసుకోవాల్సి వచ్చింది.

ట్రాక్టర్లు, పరికరాలు వైసీపీ నేతల కల్లాల్లోనే

ఉమ్మడి కర్నూలు జిల్లాలో వైఎస్సార్ యంత్ర సేవా పథకం ద్వారా తమ అనుచరులు, తమ కుటుంబ సభ్యుల పేరుతో ఆ పార్టీ నేతలు రైతు సంఘాలను ఏర్పాటు చేసి పథకం ద్వారా ట్రాక్టర్లు, ఇతర పరికరాలను పొందారనే ఆరోపణలు పెద్ద ఎత్తున వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వం ఈ పథకం ద్వారా సంఘాలకు ఇచ్చిన ట్రాక్టర్లు, పరికరాలను రైతుభరోసా కేంద్రాల్లో పెట్టేందుకు వసతి కల్పించలేదు. ఎలాగూ సంఘాల్లో ఉన్న సభ్యులంతా తమ కుటుంబ సభ్యులు, అనుచరులే కావడంతో ఎవరూ నోరెత్తలేరనే ధీమాతో ఆ పార్టీ నాయకులు తమ కల్లాల్లో, ఇళ్ల వద్ద యంత్రాలు పెట్టుకున్నారు. తమ సిఫారసు వుంటేనే వీటిని రైతులకు అందించాలని రైతు కేంద్రాల్లోని సిబ్బందికి హుకుం జారీ చేశారు. రైతు భరోసా కేంద్రాల్లోని సిబ్బంది గత ప్రభుత్వ హయాంలో అధికార నాయకులు, వారి అనుచరుల మాట జవదాటే అవకాశం ఉండేది కాదు.



వైసీపీ నేతల కల్లాల్లో ఉన్న ట్రాక్టరు

- యంత్రాలన్నీ ఆనాటి అధికార పార్టీ నాయకులకే
- రూ.30 కోట్ల రాయితీ దుర్వినియోగం
- రూ.60 కోట్ల రుణం ఎలా వసూలు చేయాలో దిక్కుతోచని సహకార బ్యాంకు అధికారులు

రైతన్నల విన్నపాలు చెత్తబుట్టలో

గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో యంత్ర పరికరాలను, ట్రాక్టర్లను వ్యక్తిగతంగా అర్హతను బట్టి రైతులకు అందించేవారు. టార్పాలిన్లు, ఐవాన్స్ స్ప్రేయర్లు, ట్రాక్టర్లు తదితర వాటిని 40 నుంచి 50 శాతం సబ్సిడీతో రైతులకు ఇచ్చేవారు. అదే విధంగా వ్యక్తిగతంగా వ్యవసాయ యంత్ర పరికరాలను అందించాలని గత వైసీపీ ప్రభుత్వంలో రైతులు మొర పెట్టుకున్నారు. అయితే.. వారి మొర ఆలకించిన నాథుడే లేకపోవడం దురదృష్టకరం. సంఘాలకు యంత్ర పరికరాలను అందిస్తే తమకు పెద్ద ఎత్తున ట్రాక్టర్లు, ఇతర యంత్ర పరికరాల కంపెనీల నుంచి పెద్ద మొత్తంలో ముడుపులు అందుతాయనే ఉద్దేశంతోనే రైతు సంఘాలకు యంత్ర సేవా పథకాన్ని అమలు చేశారని రైతు సంఘాల నేతలు ఆరోపిస్తున్నారు.

జిల్లా సహకార కేంద్ర బ్యాంకు అధికారులు సతమతం

ఈ పథకానికి దాదాపు రూ.62 కోట్లను ప్రభుత్వం అన్ని జిల్లాల్లో జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ద్వారా రుణం అందించింది. కర్నూలు జిల్లాలో 466 యంత్ర సేవా కేంద్రాలకు, నంద్యాల జిల్లాలో 408 యంత్ర సేవా కేంద్రాలకు దాదాపు రూ.62 కోట్లను రుణంగా అందించింది. వీటిని దాదాపు రెండేళ్ల నుంచి వినియోగిస్తున్నా వాటి నుంచి నెల నెలా అందాల్సిన బకాయిలు సక్రమంగా అందకపోవడంతో జిల్లా సహకార కేంద్ర బ్యాంకు అధికారులు దిక్కుతోచని పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. పథకాన్ని అమలు చేసింది మీరే కాబట్టి రైతు సేవా కేంద్రాల నుంచి బకాయిలను కూడా సక్రమంగా వసూలు చేసి జమ చేయాలని బ్యాంకు అధికారులు మండల వ్యవసాయాధికారులను అడుగుతున్నారు. అయినా వారు స్పందించడం లేదు. కొన్ని గ్రామాల్లో యంత్రాలను వినియోగించుకున్న రైతులు సక్రమంగా అద్దె కడుతున్నా కూడా వాటిని సంఘాల్లోని పెద్దలు బ్యాంకుకు చెల్లించకుండా స్వాహా చేస్తున్నారనే ఫిర్యాదులు సహకార కేంద్ర బ్యాంకు అధికారుల దృష్టికి వచ్చాయి.



విచారణకు ఆదేశాలు

వైఎస్సార్ యంత్ర సేవా పథకంలో ఉమ్మడి కర్నూలు జిల్లాలో రూ.16 కోట్ల రాయితీ నిధులు పక్కదారి పట్టాయనే ఆరోపణలు వెల్లువెత్తడంతో ప్రస్తుత టీడీపీ ప్రభుత్వం పూర్తి స్థాయిలో విచారణకు ఉత్తర్వులు జారీ చేసింది. దాదాపు రూ.66 కోట్ల రుణాన్ని అందించినా సక్రమంగా రైతు సేవా కేంద్రా ల నుంచి బకాయిలు వసూలు కాకపో వడంతో చర్యలు తీసుకోవాలని జిల్లా సహ కార కేంద్ర బ్యాంకులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసినట్లు తెలుస్తోంది. ఈ మొత్తం వ్యవహారంపై యంత్ర పరికరాలు ఎక్కడ ఉన్నాయి?.. వాటిని వినియోగించుకున్న రైతులు అద్దె రూపంలో ఇప్పటి దాకా ఎంత మొత్తాన్ని చెల్లించారు?.. ఆ మొత్తాన్ని ఎవరెవరు పంచుకున్నారు?.. సహకార కేంద్ర బ్యాంకుకు ఎంత చెల్లించారు?.. తదితర అంశాలన్నింటిపైనా థర్డ్ పార్టీ అధికారుల కమిటీ విచారిస్తున్నట్లు తెలుస్తోంది.


ప్రభుత్వం విచారణకు ఆదేశించింది



గత ప్రభుత్వం అమలు చేసిన యంత్ర సేవా పథకంలో జరిగిన అక్రమాలపై విచారణ చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. గైడ్‌లైన్స్ వచ్చిన తర్వాత పూర్తి స్థాయిలో విచారణ చేస్తాం. అక్రమాలు జరిగి ఉంటే ఖచ్చితంగా సంబంధిత అధికారులు, ఇతరులపై చర్యలు తీసుకుంటాం.

\- వరలక్ష్మి, వ్యవసాయ శాఖ జేడీ, కర్నూలు

నిధులన్నీ దుర్వినియోగమే



రైతుల ప్రయోజనం పేర గత ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటూ ప్రవేశ పెట్టిన యంత్ర సేవా పథకంలో చాలా అక్రమాలు జరిగాయి. యంత్రాలు అవసరమైన రైతులను లబ్ధిదారులుగా అనర్హులని ప్రకటించారు. ఈ పథకంలో వైసీపీ నాయకులతోపాటు అధికారులు కూడా అక్రమాలకు పాల్పడ్డారు. నిధులు పెద్ద ఎత్తున దుర్వినియోగం అయ్యాయి.

-జగన్నాథం, రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

లోక్ అదాలత్ న్యాయాధికారి లీలా వెంకటశేషాద్రి



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న అతిథులు

కర్నూలు(న్యూసిటీ), సెప్టెంబరు 5: నగరంలోని ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని జిల్లా లోక్ అదాలత్ న్యాయాధికారి లీలా వెంకటశేషాద్రి అన్నారు. గురువారం స్థానిక అంబేద్కర్ భవన్‌లో పాతబస్తీ ఆటో యూనియన్ ప్రధాన కార్యదర్శి మోహమూద్ అధ్యక్షతన నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ జిల్లాను ప్రమాద రహిత జిల్లాగా మార్చేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. ఆటో డ్రైవర్లకు తప్పకుండ లైసెన్సు ఉండాలని, లేకపోతే భారీ జరిమానాలతో పాటు జైలు శిక్ష పడే అవకాశం ఉందన్నారు. కంటి చూపు సరిగ్గా లేని డ్రైవర్లకు ఆరోగ్య శ్రీ ద్వారా ఉచితంగా ఆపరేషన్లు చేస్తామని కంటి వైద్యనిపుణుడు డా.పి. సుధాకర్ అన్నారు. ట్రాఫిక్ రూల్స్ ఖచ్చితంగా పాటించాలని సీఐ మనసురుద్దీన్ తెలిపారు. ముఖ్య అతిథులుగా లీగల్ డిఫెన్స్ కౌన్సిల్ న్యాయవాది మనోహర్, గుండె వైద్య నిపుణురాలు కే. అరుణ పాల్గొన్నారు.

పెద్దాసుపత్రిలో మళ్లీ దొంగతనం

ఎక్స్‌పర్ట్ ఏజెన్సీకి రూ.20వేల పెనాల్టీ



సెక్యూరిటీ ఏజెన్సీ ఏఎస్‌వోపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న సూపరింటెండెంట్

కర్నూలు(హాస్పిటల్), సెప్టెంబరు 5: పెద్దాసుపత్రిలో న్యూరోయోగ్నస్టిక్ బ్లాకులో కొళాయిలు మళ్లీ చోరీకి గురి కావడంపై ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సి.ప్రభాకర్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం ఆయన ఆసుపత్రిలో సీఎస్ఆర్ఎంవో వెంకటేశ్వర రావు, డిప్యూటీ సీఎస్ఆర్ఎంవో హేమనళినితో కలిసి ఆసుపత్రిని పరిశీలించారు. డయోగ్నస్టిక్ బ్లాకులో ఉదయం కొళాయి చోరీకి గురి కావడంతో ఎక్స్‌పర్ట్ ఏజెన్సీ ఏఎస్‌వోపై అసహనం వ్యక్తం చేశారు. వరుసగా డయోగ్నస్టిక్ బ్లాకులో దొంగతనాలు జరుగుతున్నాయని, వార్డులో నిత్యం సెల్‌ఫోన్లు, స్టాఫ్ గేటు ఇతర వస్తువులు దొంగలు ఎత్తుకెళ్తున్నా సెక్యూరిటీ గార్డులు ఏం పని చేస్తున్నారని మండిపడ్డారు. ఎక్స్‌పర్ట్ ఏజెన్సీకి నెలకు రూ.36 లక్షలు ప్రభుత్వం చెల్లిస్తున్నా ఏం ప్రయోజనమని ప్రశ్నించారు. రేడియాలజీ విభాగంలో నాలుగు ఎక్స్‌రే యంత్రాలను ప్రారంభిస్తే కేవలం ఒకటి మాత్రమే ఉపయోగిస్తున్నారని సిబ్బందిపై అసహనం వ్యక్తం చేశారు. ల్యాబ్ పరీక్షలు త్వరగా రిజిస్ట్రేషన్ చేసుకుని ఆయా విభాగాలకు అందించాలన్నారు. సూపరింటెండెంట్ వెంట ఏఆర్ఎంవో వెంకటరమణ, న్యూరోయోగ్నస్టిక్ బ్లాక్ ఇన్‌చార్జి సునీల్ ప్రశాంత్, ఆసుపత్రి ఏడీ రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

కౌతాళం రెవెన్యూ అధికారులపై కేసు నమోదు

కౌతాళం, సెప్టెంబరు 5: ఎలాంటి విచారణ చేయకుండానే తప్పుడు కుల ధ్రువీకరణపత్రం మంజూరు చేసిన కౌతాళం తహసీల్దార్‌పై కేసు నమోదైంది. ఆయనతో పాటు మరో ముగ్గురు రెవెన్యూ అధికారులపై గురువారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మమ్మద్ రిజ్వాన్ తెలిపారు. ఇటీవల మండల పరిధిలోని బదినేహాల్ గ్రామం నుంచి కర్నూలుకు చెందిన నల్లగొడ్డి శ్రీనివాసులు తప్పుడు పత్రాలు సృష్టించి ఎస్టీ కుల సర్టిఫికెట్ కోసం దరఖాస్తు చేసుకున్నాడు. అయితే ఈ విషయంలో రెవెన్యూ అధికారులు ఎలాంటి విచారణ చేపట్టకుండానే ఎస్టీ కుల ధ్రువీకరణ పత్రాన్ని మంజూరు చేశారు. ఈ ఉదంతంపై కర్నూలులో కలెక్టర్‌కు ఎస్సీ, ఎస్టీ సంఘాలు ఫిర్యాదు చేశాయి. దీంతో కలెక్టర్ రంజిత్ బాషా ఆదేశాల మేరకు విచారణకు ఆదేశించారు. కుల ధ్రువీకరణ పత్రం మంజూరు చేసిన వీఆర్వో సూర్యనారాయణ రెడ్డి, ఆర్ఐ రాజశేఖర్‌గౌడ్, డిప్యూటీ తహసీల్దార్ వీరభద్ర గౌడ్, తహసీల్దార్ మల్లికార్జున స్వామిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

గురువు స్థానం మహోన్నతం

- సర్వేపల్లి రాధాకృష్ణన్ జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలి
- కలెక్టర్ పి. రంజిత్ బాషా



ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

కర్నూలు(కలెక్టరేట్), సెప్టెంబరు 5: సమాజంలో గురువు స్థానం మహోన్నతమైనదని కలెక్టర్ పి.రంజిత్‌బాషా అభిప్రాయ పడ్డారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ జీవితాన్ని విద్యార్థులు, గురువులు ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా గురువారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో గురుపూజోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి కలెక్టర్ పి.రంజిత్‌బాషా, కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత, ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం జిల్లాలో ఉపాధ్యాయ వృత్తిలో ఉత్తమ సేవలు అందించిన 23 మంది ఉపాధ్యాయులకు కలెక్టర్, ఎంపీ, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు శాలువా కప్పి, సర్టిఫికెట్లు అందజేసి సన్మానించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సర్వేపల్లి రాధాకృష్ణన్ ఒక సామాన్య కుటుంబంలో జన్మించి రాష్ట్రపతి స్థాయికి ఎదిగారన్నారు.

ఎంపీ బస్తిపాటి నాగరాజు మాట్లాడుతూ కర్నూలు పార్లమెంటు స్థానానికి పోటీ చేయకముందు ప్రభుత్వ కళాశాలలో కాంట్రాక్టు అధ్యాపకుడిగా పనిచేశానని తెలిపారు. ఈ స్థాయికి రావడానికి ఉపాధ్యాయుల ప్రోత్సాహం ఎంతగానో ఉపయోగపడిందన్నారు. ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి మాట్లాడుతూ సర్వేపల్లి రాధాకృష్ణన్ పట్టుదలను విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. ఎమ్మెల్యే గౌరు చరిత మాట్లాడుతూ కనిపించే ప్రత్యక్ష దైవం గురువు అన్నారు. ఎంతోమంది ఉన్నత స్థానాలకు చేరుకోవడంలో గురువుల పాత్ర అమోఘమన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ సీఈవో నాసరరెడ్డి, డీఈవో శామ్యూల్, జడ్పీటీసీ సభ్యుడు ప్రసన్న కుమార్, కార్పొరేటర్ పద్మలత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి

చవితి సందడి



- గణేశ్ నవరాత్రి ఉత్సవాలకు ఉమ్మడి జిల్లా ముస్తాబు
- రేపటి నుంచి చవితి ఉత్సవాలు ప్రారంభం

కర్నూలు (కల్చరల్), సెప్టెంబరు 5: నంద్యాల, కర్నూలు జిల్లాల వ్యాప్తంగా వినాయక చవితికి ఏర్పాట్లు చివరి దశకు చేరుకున్నాయి. వాడవాడలా విగ్రహాలు పెట్టేందుకు యువకులు పోటీపడుతున్నారు. చవితి పూజా సామగ్రి కొనుగోళ్లతో మార్కెట్లు కళకళలాడుతున్నాయి. అన్ని పట్టణాల్లోని వీధుల్లో వినాయక మండపాలు ఏర్పాటు చేశారు. శనివారం జరిగే వినాయక చవితి వేడుకకు భక్తులు సిద్ధమయ్యారు. తొలిపూజతో 'గణేశ్ నవరాత్రి ఉత్సవాలు' అంగరంగ వైభవంగా ఆరంభం కాబోతున్నాయి. తొమ్మిది రోజుల పాటు ఈ మహోత్సవాలను కన్నుల పండువగా నిర్వహించేందుకు గణేశ్ భక్త ఉత్సవ కమిటీల ప్రతినిధులు సిద్ధమయ్యారు. వినాయక విగ్రహాలను మండపాలను తరలిస్తున్నారు. హైదరాబాదు తర్వాత రాష్ట్రంలో ఒక్క కర్నూలు జిల్లాలోనే గణేశ్ ఉత్సవాలు అంగరంగ వైభవంగా సాగుతాయి. ఈ ఏడాది కర్నూలు నగరంలో 2వేలకు పైగా విగ్రహాల వరకు వివిధ ప్రాంతాల్లో నెలకొల్పుతున్నారు. జిల్లా వ్యాప్తంగా మరో వెయ్యి విగ్రహాల వరకు నెలకొల్పుతున్నారు. గణేశ్ నవరాత్రి ఉత్సవాలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని, ఎలాంటి సమస్యలు వచ్చినా వాటిని అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని జిల్లా పోలీసు అధికారులు సూచిస్తున్నారు. కాగా జిల్లా యంత్రాంగం కూడా ఉత్సవాల నిర్వహణకు పలు సూచనలు చేసింది.



వినాయక విగ్రహాలకు పెరిగిన గిరాకీ

ఏటా వినాయక చవితిని పురస్కరించుకుని ఉమ్మడి జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో విగ్రహ తయారీదారులు గత మూడు నెలల నుంచే విగ్రహాలను తయారు చేయడం ప్రారంభించారు. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ మట్టి, జనప నార, కొబ్బరి పీచు, వివిధ రకాల రంగులతో వీటిని ఆకర్షణీయంగా రూపొందించారు. ఈ ఏడాది వినాయక విగ్రహాలకు గిరాకీ పెరిగింది. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ మట్టి, ఇతరత్రా ముడిసరుకుల ధరలు పెరగడంతో విగ్రహాల ధరలు కూడా పెంచాల్సి వచ్చిందని వ్యాపారులు చెబుతున్నారు. మూడు అడుగుల నుంచీ పదిహేను అడుగుల వరకు విగ్రహాలను తయారీ చేస్తున్నారు. ఒక్కో విగ్రహం రూ.30 వేల నుంచి రూ.1.50 లక్షల వరకు ధరలు పలుకుతున్నాయి. గణేశ్ ఉత్సవ మండపాల నిర్వాహకులు ముందస్తుగా విగ్రహాలను ఎంపిక చేసుకోవాల్సి వస్తోంది.



ఇసుక పాట్లు..!


ఇసుక బుకింగ్ చేస్తున్న సిబ్బంది

కర్నూలు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఇసుక కోసం భారీగా బారులు తీరారు. కర్నూలు నగరం రైల్వే స్టేషన్ సమీపంలో గనులు, భూగర్భ వనరుల శాఖ డీడీ కార్యాలయం ఆవరణలో ఇసుక బుకింగ్ కేంద్రం వద్ద గురువారం ట్రాక్టరు, టిప్పరు డ్రైవర్లు 'ఇసుక'పాట్లు అనుభవిస్తున్నారు. సి. బెళగల్ మండలం ఈర్లదిన్నె, కొత్తకోట, కె.సింగవరం గ్రామాల వద్ద తుంగభద్ర నదిలో బోటు ద్వారా ఇసుక తవ్వకాల చేసే డీసిల్టేషన్ రీచులను ప్రారంభించారు. జిల్లా స్థాయి ఇసుక కమిటీ పర్యవేక్షణలో ఇసుక తవ్వకాలు, రవాణా, సరఫరా చేస్తున్నారు. ఈ నెల 11వ తేది నుంచి ఆన్‌లైన్ బుకింగ్ మొదలవుతుంది. అప్పటి వరకు భవన నిర్మాణదారులకు ఇసుక కొరత తలెత్తకుండా కర్నూలు నగరంలోని మైనింగ్ డీడీ కార్యాలయం, సి.బెళగల్ తహసీల్దారు కార్యాలయం ఆవరణలో బుకింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఇసుక డిమాండ్ దృష్ట్యా ట్రాక్టరు, టిప్పరు డ్రైవర్లు తెల్లావారుజామున 4-5 గంటలకే మైనింగ్ ఆఫీసులోని బుకింగ్ కేంద్రానికి చేరుకుంటున్నారు. ఉదయం 9.30 గంటలు తరువాత బుకింగ్ సిబ్బంది వస్తారు. అంటే.. నాలుగైదు గంటలు ఇసుక కోసం వరుసలో నిరీక్షించాల్సి వస్తున్నది. ఆన్‌లైన్ బుకింగ్ ప్రారంభం అయ్యేంతవరకు ఈ కష్టాలు తప్పవని అధికారులు అంటున్నారు.

- ఇసుక బుకింగ్ కోసం బారులు తీరిన ట్రాక్టర్, టిప్పర్ డ్రైవర్లు
- తెల్లారక ముందే మైనింగ్ కార్యాలయానికి..


రైల్వే స్టేషన్ సమీపంలోని మైనింగ్ డీడీ కార్యాలయం ఆవరణలో ఇసుక బుకింగ్ కోసం బారులు

శ్రీశైలంలో నకిలీ పోలీసు


స్వాధీనం చేసుకున్న డబ్బు, కారు, ఐడీకార్డు

శ్రీశైలం, సెప్టెంబరు 5: శ్రీశైలంలో పోలీస్ పేరుతో చెలామణి అవుతున్న ఓ వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. హైదరాబాద్‌కు చెందిన కుసుమ ప్రశాంత్ సైబరాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఆర్‌ఎస్‌ఐగా విధులు నిర్వహిస్తున్నట్లు చెప్పి ఈ నెల ఒకటో తేదీన శ్రీశైలం పోలీసులకు ప్రొటోకాల్ దర్శనం, వసతి సౌకర్యాలను కల్పించాలని కోరాడు. అయితే అతని ప్రవర్తనపై అనుమానం వచ్చిన సీఐ ప్రసాదరావు విచారణ చేపట్టారు. సైబరాబాద్ కమిషనరేట్‌లో ఆర్‌ఎస్‌ఐగా పనిచేస్తున్నట్లు నకిలీ ఐడీతో శ్రీశైలానికి వచ్చాడు. అదేవిధంగా హైదరాబాద్‌లోని ఘట్‌కేశ్వర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ పంచాయితీ చేస్తానంటూ రూ.40వేలు ఫోన్ పే ద్వారా తన ఖాతాకు మళ్లించుకున్నాడు. కొందరు అధికారుల పేర్లు చెప్పి ఇలాంటి సెటిల్‌మెంట్లకు పాల్పడుతున్నట్లు పోలీసులు గుర్తించారు. దీంతో అతడిని అరెస్టు రిమాండ్‌కు తరలించారు. అతడి నుంచి రూ.1,020, కారును పోలీసులు సీజ్ చేశారు.

సీఎం సహాయ నిధికి విరాళాలు


చెక్కును కలెక్టర్‌కు అందజేస్తున్న అధికారులు

కర్నూలు(కలెక్టరేట్), సెప్టెంబరు 5: కష్టాల్లో ఉన్న వరద ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలకు అండగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సీఎం సహాయ నిధికి సిగాచి ఇండస్ట్రీస్, సిండికేట్ రిటైర్డ్ ఎంప్లాయిస్ ముచ్చువల్ ఎయిడెడ్ కో ఆపరేటివ్ సొసైటీ, ఆదోని శ్రీ మహాయోగి లక్ష్మమ్మ కోఆపరేటివ్ బ్యాంకు వారు విరాళాలు అందజేశారని కలెక్టర్ పి. రంజిత్ బాషా పేర్కొన్నారు. ఆదోని శ్రీమహాయోగి లక్ష్మమ్మ కో ఆపరేటివ్ బ్యాంకు తరపున డీసీవో రామాంజనేయులు రూ.5 లక్షలు చెక్కును కలెక్టర్‌కు అందజేశారు. సిగాచి ఇండస్ట్రీస్ ప్రాజెక్టు ఇంజనీర్ నలిని కాంత్ రాజు రూ.లక్ష చెక్కును అందజేశారు. అదేవిధంగా సిండికేట్ రిటైర్డ్ ఎంప్లాయీస్ మ్యూచువల్ ఎయిడెడ్ కోఆపరేటివ్ సొసైటీ ప్రతినిధుల సెక్రటరీ శ్రీనివాసరెడ్డి, ట్రెజరర్ రిజ్వాన బేగం, ప్రభాకర్ రూ.లక్ష చెక్కును ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ మారుతి ప్రసాద్, డీసీవో రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

నిమజ్జన ఘాట్‌ను పరిశీలించిన నగర పాలక కమిషనర్


అధికారులకు సూచనలు ఇస్తున్న కమిషనర్ పీవీ రామలింగేశ్వర్

కర్నూలు (కల్చరల్), సెప్టెంబరు 5: నగరంలో వినాయక విగ్రహాలను నిమజ్జనం చేసే కేసీ కెనాల్ వినాయక ఘాట్‌ను గురువారం సాయంత్రం నగరపాలక సంస్థ కమిషనర్ పీవీ రామలింగేశ్వర్ మున్సిపల్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఘాట్ వద్ద మొదలైన పిచ్చిమొక్కల తొలగింపు, పరిశుభ్రత, పారిశుధ్యం పనులను ఆయన త నిఖీ చేశారు. ఈ సందర్భంగా నిమజ్జనం రోజున నగర పాలక సంస్థ చేపట్టాల్సిన చర్యలపై అధికారులతో చర్చించారు. అనంతరం 17, 18 వార్డులలో ఆయన విస్తృతంగా పర్యటించి, పలు సమస్యలపై చర్చించారు. ఆయన వెంట నగరపాలక ఆరోగ్య అధికారి విశ్వేశ్వరరెడ్డి, డీసీపీ సంధ్య, డీఈ నరేష్, ఏఈలు జనార్దన్, భానుప్రకాశ్ పాల్గొన్నారు.

పోలీసు వాహనాలకు నూతన టెక్నాలజీ


సిబ్బందికి సూచనలు ఇస్తున్న ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా

నంద్యాల క్రైం, సెప్టెంబరు 5: నంద్యాల జిల్లాలోని పోలీసు వాహనాలకు నూతన టెక్నాలజీతో కూడిన జీపీఎస్‌లను అమర్చినట్లు ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా తెలిపారు. గురువారం ఏడు హైవే మొబైల్ వాహనాలకు, 22 బ్లూకోట్ వాహనాలకు జీపీఎస్‌లను అమర్చారు. జీపీఎస్ విధానం ద్వారా పోలీస్ సిబ్బంది ఏ ప్రదేశాల్లో తిరుగుతున్నారు, మునుపటి రోజుల్లో ఏయే ఏరియాల్లో తిరిగారన్నది కచ్చితంగా తెలుసుకునే వీలుందని ఎస్పీ పేర్కొన్నారు. అలాగే ఏదైనా ఘటన జరిగితే ఆ స్థలానికి ఎవరు దగ్గరలో ఉన్నారన్నది కూడా ఈ జీపీఎస్ విధానం ద్వారా తెలుస్తుందన్నారు. తద్వారా సంఘటనా స్థలానికి దగ్గరలో ఉన్న సిబ్బందిని పంపే వీలుంటుందని పేర్కొన్నారు. పోలీస్ సిబ్బంది గస్తీ తిరుగుతున్నారా? లేక ఒకేచోట విశ్రాంతి తీసుకుంటున్నారా? అన్న వివరాలు తెలుసుకుని అప్రమత్తం చేయడానికి ఈ విధానం ఎంతో ఉపయోగపడుతుందని వెల్లడించారు. సిబ్బంది గస్తీ తిరగడంలో నిర్లక్ష్యం, అప్రమత్తంగా ఉన్నారో లేదో తెలిసిపోతుందన్నారు. రాష్ట్రంలోనే మొట్టమొదటిసారిగా నంద్యాల జిల్లాలో బ్లూకోట్ వాహనాలకు జీపీఎస్ అమర్చి నేరాలను నియంత్రించేందుకు ప్రత్యేకశ్రద్ధ తీసుకుంటున్నామని ఎస్పీ వెల్లడించారు. అలాగే హైవే మొబైల్ వాహనాల డ్రైవర్లకు, బ్లూ కోట్ వాహనాల డ్రైవర్లతో ప్రత్యేకంగా సమావేశం జరిపి నేరాల నియంత్రణలో ముఖ్య పాత్ర పోషించిన వారికి రివార్డులు, అలసత్వం వహించిన వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా స్పష్టం చేశారు.

వ్యక్తి ఆత్మహత్య

కోసిగి, సెప్టెంబరు 5: జీవితంపై విరక్తి చెందిన ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన కోసిగి మండలంలోని చిన్నభోంపల్లి గ్రామానికి చెందిన గొల్ల నారాయణ గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతుండేవాడు. దీంతో జీవితంపై విరక్తి చెందిన నారాయణ గురువారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య మహాలక్ష్మి, ఇద్దరు కుమారులు సంతానం.

సొంతానికి 130 మీటర్ల డ్రైనేజీ

- రూ. 5 లక్షల పంచాయతీ నిధులు ఇవ్వాలని అధికారులపై ఒత్తిడి
- అనుమతి తీసుకోలేదంటున్న అధికారులు

ఆదోని రూరల్ సెప్టెంబరు 5 : ఆదోని మండలం కుప్పగల్ గ్రామ సర్పంచు నాగిరెడ్డి వైసీపీ నుంచి టీడీపీలోకి వచ్చి పంచాయతీ నిధులతో 130 మీటర్ల డ్రైనేజీ కాలవ నిర్మించుకున్నట్లు విమర్శలు వస్తున్నాయి. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు అప్పటి ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డికి నాగిరెడ్డి నోట్లో నాలుకలా ఉండేవాడు. సర్పంచు ఎన్నికల్లో వైసీపీ మద్దతుతో గెలిచాడు. వైసీపీ ప్రభుత్వం ఉన్నన్నాళ్లు ఆయన ఆడిందే ఆట, పాడిందే పాటగా సాగింది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే టీడీపీ మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు సమక్షంలో వైసీపీని వీడి టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. కూటమి కొట్లాటతో ఆదోని మండలంలో టీడీపీ నాయకుల మాట చెల్లడం లేదని గుర్తించిన సదరు సర్పంచు నాగిరెడ్డి ఆఘమేఘాలపై బిజెపి ఎమ్మెల్యే పార్థసారధి సమక్షంలో ఆ పార్టీలో చేరాడు.


పంచాయతీ నిధులతో సర్పంచు ఇంటికి వేసుకొన్న డ్రైనేజీ కాల్వ

సొంత ఇంటి డ్రైనేజీ నిర్మాణానికి...

సర్పంచు నాగిరెడ్డి అధికారులపై ఒత్తిడి తెచ్చి గ్రామంలో తన ఇంటికి ఏకంగా 130 మీటర్లు డ్రైనేజీ కాల్వను కట్టించుకున్నాడు. ఆ డ్రైనేజీ పరిసర ప్రాంతంలో ఆయన ఇల్లు మాత్రమే ఉంది. తన ఇంటి కోసం ఈ 130 మీటర్ల డ్రైనేజీ కాల్వకు రూ.5లక్షలు ఖర్చు చేసినట్లు తెలుస్తోంది. కాల్వ పూర్తయిన తరువాత పంచాయతీ నిధుల కింద రూ.5లక్షలు బిల్లులు మంజూరు చేయాలని ఎంబుక్ తయారు చేసి అధికారుల ముందు విసిరేశాడు.

మా అనుమతి తీసుకోలేదు...

కుప్పగల్లు గ్రామ సర్పంచు తన ఇంటికి డ్రైనేజీ కాలువ నిర్మించుకున్నాడు. ఆ కాల్వకు ఇరువైపులా గరుసు కూడ వేయలేదు. నాసిరకంగా నిర్మించాడు. పని ప్రారంభించకముందు ఎస్టిమేషన్ ఇవ్వాలి. సర్పంచు మాత్రం పని పూర్తి చేసి ఎస్టిమేషన్ ఇచ్చాడు. రూ.5లక్షలతో నిర్మించానన్న కాల్వను పరిశీలించాను. సర్పంచు ఇల్లు తప్ప అక్కడ ఎవరూ నివాసం ఉండడం లేదు. మా అనుమతి తీసుకోలేదు కాబట్టి బిల్లు మంజూరు చేయకుండా ఆపాను.

-రాణి, పంచాయతీ రాజ్ డిఈ

వార్షిక రుణ ప్రణాళికలో రూ.12,828 కోట్లు

- పంట రుణాలకు రూ.5,366 కోట్లు లక్ష్యం
- బ్యాంకర్ల సమావేశంలో మంత్రి ఫరూక్

నంద్యాల (కల్చరల్), సెప్టెంబరు 5: నంద్యాల జిల్లాలో 2024 సంవత్సరంలో 25వ వార్షిక రుణాల ప్రణాళిక కింద వివిధ బ్యాంకుల ద్వారా రూ.12,828 కోట్లు రుణాలు అందించాలని లక్ష్యంగా నిర్దేశించినట్లు రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో కలెక్టర్ రాజకుమారి అధ్యక్షతన బ్యాంకర్ల సమన్వయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి ఫరూక్ మాట్లాడుతూ ప్రధానంగా వ్యవసాయ రంగానికి రూ.5,366 కోట్లు, టర్మ్‌లోన్లకు రూ.2,503 కోట్లు, చిన్న, మధ్యతర పరిశ్రమలకు రూ.1,400 కోట్లు, గృహనిర్మాణాలకు రూ.567 కోట్లు, ప్రాధాన్యత రంగాలకు రూ.394 కోట్లు ఇతర ప్రాధాన్యత రంగాలకు కేటాయించిన లక్ష్యాలను అధిగమించేందుకు బ్యాంకర్లు సహకరించాలని మంత్రి కోరారు. అలాగే టిడ్కో కింద లబ్ధిదారులకు ఇళ్లను కేటాయించామని మరింత చేయూతనిచ్చి రుణాల మంజూరుకు సహకరించాలని బ్యాంకర్లను సూచించారు. కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ జిల్లాలో కౌలు రైతులకు రుణాల కింద రూ.130 కోట్లు మంజూరు చేశారని దాదాపు 30 వేల మంది కౌలు రైతులకు రుణాలు ఇవ్వాలన్నారు. ఆర్వోఎఫ్ఆర్ కింద సాగు చేసుకుంటున్న రైతులకు రుణాలు మంజూరు చేయాలన్నారు. ఎంపీ బైరెడ్డి శబరి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నుంచి ముద్ర రుణాలను నిరుపేదలకు విరివిగా ఇవ్వాలన్నారు. నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య మాట్లాడుతూ కౌలు రైతులకు రుణాలు ఇవ్వడంతో పాటు వర్షాల వల్ల దెబ్బతిన్న పంటలకు రుణాల రీషెడ్యూల్ చేస్తూకొత్త రుణాలు ఇవ్వాలని కోరారు. ఈ సమావేశంలో వ్యవసాయ అనుబంధ రంగాల అధికారులు, వివిధ బ్యాంకుల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.


బ్యాంకర్ల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఫరూక్

రుణాల పేరిట దగా

- రూ. లక్షల్లో వసూలు చేసిన మహిళకు దేహశుద్ధి
- మరో ఇద్దరికి కోసం గాలిస్తున్న పోలీసులు

ఆలూరు, సెప్టెంబరు 5 : ఆలూరుకు చెందిన ఈరమ్మ అనే మహిళస్పాట్ రుణాల పేరుతో రూ. లక్షల్లో వసూలు చేసి చెల్లించిన డబ్బులు తిరిగి ఇవ్వలేదు. దీంతో గురువారం పట్టణంలోని కోయనగర్‌కు చెందిన మహిళలు జంగాలి ఈరమ్మను నిర్బంధించి దేహశుద్ధి చేశారు. తమ డబ్బులు తిరిగి ఇవ్వాలంటూ నిలదీశారు. ఇందులో ముద్దన గేరికి చెందిన మైకేల్, హాలేబీడుకు చెందిన చాకలి బసవరాజు పాత్ర కూడా ఉన్నట్లు వెల్లడైంది. ఈ ముగ్గురు కలసి కొంత మంది నుంచి బంగారు కూడా తీసుకొని ఓ ప్రైవేట్ ఫైనాన్స్ బ్యాంక్ నుంచి రుణాలు పొందినట్లు మహిళలు పోలీసులకు వివరించారు. తమ డబ్బుతో ప్లాట్లు కూడా కొనుగోలు చేసినట్లు ఫిర్యాదు చేశారు. ఎస్సై వెంకట నరసింహులు ఆ మహిళను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. తమ డబ్బు తమకు ఇప్పించాలని మహిళలు కోరుతున్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

కర్నూలు, సెప్టెంబరు 5: మూడో పట్టణ పోలీస్‌స్టేసన్ పరిధిలో లక్ష్మీనగర్‌లో విద్యుదాఘాతానికి గురై మహ్మద్ షరీఫ్ (41) అనే వ్యక్తి మృతి చెందాడు. షరీఫ్ స్థానిక లక్ష్మీనగర్‌లో మోటారు సైకిళ్లకు సీటు కవర్లు కుట్టుకుంటూ జీవిస్తున్నాడు. ఈయన దుకాణం పక్కనే రవి కలెక్షన్స్ అనే దుకాణం ఉంది. ఆ షాపు చెందిన ఇనుపబోర్డును సెకండ్ ఫ్లోర్‌లో పెట్టేందుకు మహ్మద్ షరీఫ్ సాయం కోరారు. కింద బోర్డును పైకి లాగే క్రమంలో ప్రమాదవశాత్తు బోర్డుకు సంబంధించిన ఇనుప కడ్డీలు కరెంటు తీగలకు తగిలాయి. ఈ ప్రమాదంలో మహ్మద్ షరీఫ్ అక్కడికక్కడే మృతి చెందగా.. మరో ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. వీరిని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మురళీధర్ రెడ్డి తెలిపారు.

మట్కాబీటర్ల అరెస్టు

కర్నూలు, సెప్టెంబరు 5: మూడో పట్టణ పోలీస్‌స్టేసన్ పరిధిలో మట్కా నిర్వహిస్తున్న నలుగురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. నిందితులు షేక్ సర్దార్ బాషా, హుశేన్‌బాషా, షేక్షావలి, షబ్బీర్ అహ్మద్‌లను అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.50 వేల నగదు, మట్కా చీటీలు స్వాధీనం చేసుకున్నారు. నిందితులంతా దేవనగర్ సమీపంలో మట్కా నిర్వహిస్తున్నట్లు గుర్తించి వారిని అరెస్టు చేసినట్లు సీఐ మురళీధర్ రెడ్డి తెలిపారు.

చికిత్స పొందుతూ రైతు మృతి

శిరివెళ్ల, సెప్టెంబరు 5: శిరివెళ్లలోని ఎస్సీ కాలనీకి చెందిన సుధాకర్ (54) అలియాస్ గంగన్న అనే రైతు ఆత్మహత్యాయత్నం చేసి చికిత్స పొందుతూ కోలుకోలేక గురువారం మృతి చెందాడు. సుధాకర్ గత నాలుగేళ్లుగా కొంత పొలాన్ని కౌలుకు తీసుకొని వివిధ పంటలు సాగు చేసి, దిగుబడులు రాక అప్పుల పాలయ్యాడు. అప్పులు తీర్చే మార్గం తెలియక మనోవేదనకు గురై ఈనెల 4వ తేదీన పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు నంద్యాల ప్రభుత్వ వైద్యశాలకు తీసుకెళ్లారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం కర్నూలుకు తరలించారు. అక్కడ కోలుకోలేక మృతి చెందినట్లు ఎస్ఐ చిన్న పీరయ్య గురువారం తెలిపారు. తెలిపారు. మృతుడి భార్య విశ్వాసమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెల్లడించారు.

విజిలెన్స్ ఎస్పీగా చౌడేశ్వరి బాధ్యతల స్వీకరణ


బాధ్యతలు స్వీకరిస్తున్న విజిలెన్స్ ఎస్పీ చౌడేశ్వరి

కర్నూలు, సెప్టెంబరు 5: విజిలెన్స్ ఎస్పీగా చౌడేశ్వరి గురువారం రాత్రి బాధ్యతలు స్వీకరించారు. ఈమె గతంలో అనంతపురం అడిషనల్ ఎస్పీగా, గుంతకల్లు రైల్వే ఎస్పీగా పని చేశారు. బాధ్యతలు తీసుకున్న ఆమెకు విజిలెన్స్ కార్యాలయ సిబ్బంది ఆమెకు ఘనస్వాగతం పలికారు.

కర్నూల్లో ఆత్యాధునిక క్రీడా సౌకర్యాలు కల్పించండి

కర్నూలు(అర్బన్), సెప్టెంబరు 5: కర్నూల్లో ఆత్యాధునిక క్రీడా సౌకర్యాలు కల్పించాలని మంత్రి టీజీ భరత్ అన్నారు. గురువారం సాయంత్రం ఢిల్లీ పర్యటన లో కేంద్ర క్రీడా శాఖా మంత్రి మున్సుఖ్ మాండ వీయాను ఆయన నివాసంలో కలిసి కోరారు. నగరంలో అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలు గల క్రీడా ప్రాంగణాన్ని నిర్మించాలని కోరారు. దీంతో పాటు అత్యుత్తమమైన కోచ్‌లను నియమించాలన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మొదటి రాజధాని అయిన కర్నూల్లో క్రీడల అభివృద్ధి అన్ని రకాల అవకాశం ఉందన్నారు. కర్నూలు నుండి ఎంతో మంది క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తున్నట్లు వివరించారు. క్రీడాకారులను ప్రోత్సహిస్తే దేశానికి ఎన్నో పతకాలు తీసుకొస్తారని తెలిపారు.


కేంద్ర మంత్రిని కలిసిన మంత్రి టీజీ భరత్

ఆర్డీఎస్ ఆనకట్టకు జలకళ


ఆర్డీఎస్ ఆనకట్టపై పారుతున్న వరద నీరు

కోసిగి, సెప్టెంబరు 5: మండల పరిధిలోని అగసనూరు సమీపంలోని తుంగభద్ర నదిపై ఉన్న ఆర్డీఎస్ (రాజోలి బండ డైవర్షన్ స్కీం) ఆనకట్ట వద్ద జలకళ సంతరించుకుంది. టీబీ డ్యాం నుంచి 50వేల క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల చేయడంతో దిగువన గత వారం రోజుల నుంచి కురుస్తున్న భారీ వర్షాలకు వరద ఆర్డీఎస్ ఆనకట్టకు పోటెత్తింది. దీంతో నదీతీర గ్రామాల్లోని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఆర్డీఎస్‌కు వరద రావడంతో రైతులు వరినారు వేయడంలో బిజీ అయ్యారు. తుంగభద్ర నది ఉధృతంగా ప్రవహించడంతో అధికారులు ప్రమాద హెచ్చరికలు జారీ చేశారు.

విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు

చిత్తూరు జిల్లా పశువైద్యశాఖ జేడీ ప్రభాకర్


చాగలమర్రి పశువైద్యశాలను పరిశీలిస్తున్న జేడీ ప్రభాకర్

చాగలమర్రి, సెప్టెంబరు 5: గ్రామాల్లో పశువైద్య సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని చిత్తూరు జిల్లా పశువైద్యశాఖ జేడీ ఎన్.ప్రభాకర్ తెలిపారు. గురువారం సాయంత్రం చాగలమర్రి పశువైద్యశాలను ఆయన తనిఖీ చేశారు. సంబంధిత రికార్డులను పరిశీలించారు. దెబ్బతిన్న పశువైద్యశాలను పరిశీలించారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి భవన మరమ్మతులకు ప్రతిపాదిస్తామని అన్నారు. నంద్యాల జిల్లా జేడీ, పశువైద్య సిబ్బంది, అధికారుల మధ్య సమన్వయ లోపం ఉండటంతో విచారణ చేసేందుకు వచ్చినట్లు తెలిపారు. ఆళ్లగడ్డ, చాగలమర్రి పశువైద్యశాలలు, రెండు ఉప కేంద్రాలను తనిఖీ చేశామన్నారు. వైద్య సిబ్బంది పనితీరును పరిశీలించామన్నారు. పశువుల్లో వచ్చే వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు తప్పనిసరిగా వేయించాలని ఆయన సిబ్బందిని ఆదేశించారు. పశుబీమాపై అవగాహన కల్పించాలని అన్నారు. ఉపాధిహామీ ద్వార మినీ గోకులాల కోసం దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. జేడీ వెంట ఏడీలు వర్రప్రసాద్, చంద్రశేఖర్, వైద్యాధికారులు సాయిబాబా, రవీంద్రారెడ్డి, దీపకుమారి తదితరులు ఉన్నారు.

పెద్దాసుపత్రిలో 20వేల సప్తవర్ణ దుప్పట్లు



దుప్పట్లను ఆవిష్కరిస్తున్న సూపరింటెండెంట్ సి.ప్రభాకర్ రెడ్డి

కర్నూలు(హాస్పిటల్), సెప్టెంబరు 5: రోగులకు ఉత్తమ వైద్యసేవలు అందించేందుకు ఆసుపత్రిలో కొత్తగా 20వేల సప్తవర్ణ దుప్పట్లను వివిధ విభాగాలకు ఇవ్వనున్నట్లు కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సి.ప్రభాకర్ రెడ్డి తెలిపారు. గురువారం ఆసుపత్రిలోని ధన్వంతరి హాలులో నూతన స్వచ్ఛ సప్తవర్ణ దుప్పట్ల పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2018లో అప్పటి సీఎం చంద్రబాబు ఈ పథకాన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రారంభించారన్నారు. కార్యక్రమంలో ఆసుపత్రి సీఎస్ఆర్ఎంవో డాక్టర్ వెంకటేశ్వరరావు, డిప్యూటీ సీఎస్ఆర్ఎంవో హేమనళిని, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ శివబాల, కిరణ్ కుమార్, నర్సింగ్ సూపరింటెండెంట్ ఎస్పీ సావిత్రీబాయి పాల్గొన్నారు.

మట్టి వినాయకులను పూజించండి

రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్



మట్టి వినాయక విగ్రహాలు పంపిణీ చేస్తున్న టీజీ వెంకటేశ్

కర్నూలు (కల్చరల్), సెప్టెంబరు 5: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ నడుం బిగించి, మట్టి వినాయక విగ్రహాలతో పూజించాలని రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్ పిలుపునిచ్చారు. గురువారం పాతనగరంలోని పాతబస్టాండు సమీపంలో వాసవీ ఏజెన్సీస్ ఎండీ విశ్వనాథం శేషఫణి శెట్టి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత మట్టి వినాయక విగ్రహాల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సుమారు 2 వేల విగ్రహాలను టీజీ వెంకటేశ్ రాష్ట్ర ఆర్యవైశ్య నాయకుడు ఇల్లూరు లక్ష్మయ్య, దేవకి వెంకటేశ్వర్లు, విశ్వనాథం శేషఫణి శెట్టితో కలిసి పంపిణీ చేశారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కల్లూరు, సెప్టెంబరు 5: విద్యుత్ మరమ్మతు పనుల్లో భాగంగా శుక్రవారం నగరంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉటుందని కర్నూలు డివిజన్ ఈఈ టి.శేషాద్రి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సంతోష్‌నగర్ సెక్షన్ సిరినోబుల్ 11 కేవీ ఫీడర్ పరిధిలో ఉదయం 9 గంటల నుంచి 12 వరకు కరెంట్ కోత ఉటుందన్నారు. వినాయక విగ్ర హాల తరలింపులో తలెత్తుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని కొత్త పోల్ ఏర్పాటు చేస్తున్నట్లు ఏడీఈ నాగప్రసాద్ తెలిపారు. అందులో భాగంగా స్టేట్ బ్యాంక్ ఆఫీసర్స్ కాలనీ, అమీన్ హైదర్‌నగర్, సుంకే సులరోడ్, ధనలక్ష్మీనగర్, శ్రీనగర్‌కాలనీ, జనార్థన్ నగర్, వసంత రెసిడెన్సీ తుంగభద్ర కాలనీల్లో విద్యుత్ సరఫ రాలో అంతరాయం ఉంటుందని, ప్రజలు సహకరించాలని కోరారు.

తాగునీటి పథకాల పరిశీలన

సి.బెళగల్, సెప్టెంబరు 5: మండలంలోని తిమ్మనదొడ్డి, సంగాల, గుండ్రేవుల గ్రామాల్లోని తాగునీటి పథకాలను ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ గోసెనాయక్ శనివారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు కాచి వడబోసిన నీటి తాగాలన్నారు. తాగునీటి ట్యాంక్‌ల దగ్గర పరిసరాలను శుభ్రంగా ఉండేలా చూడాలని సర్పంచులకు ఆదేశించారు.

ఉత్తమ ఉపాధ్యాయుడికి అభినందనలు

కర్నూలు(కలెక్టరేట్), సెప్టెంబరు 5: ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందుకున్న వై.సిద్ద లింగాన్ని టీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రాగిరి చంద్రప్ప, ఆర్‌పీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు నాగరాజు, టీఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు చరణ్‌లు మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. రాష్ట్ర, జాతీయ స్థాయిలో ఎంతో మంది విద్యార్థులను విద్యావంతులుగా తీర్చిదిద్దాలని కోరారు.

వరద బాధితులను ఆదుకోవాలి



నిత్యావసర సరుకుల వాహనాలను తరలిస్తున్న మల్లెల రాజశేఖర్

ఓర్వకల్లు, సెప్టెంబరు 5: వరద బాధితులను ఆదుకునేందుకు దాతలు ముందుకు రావాలని టీడీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ పిలుపునిచ్చారు. గురువారం మండలంలోని హుశేనాపురం గ్రామంలో మల్లెల రాజశేఖర్ ఆధ్వర్యంలో రూ.6లక్షలు విలువ చేసే 200 బస్తాల బియ్యం, 20వేలు వాటర్ బాటిళ్లను మూడు వాహనాల్లో విజయవాడకు తరలించారు. విజయవాడ వరద బాధితులకు సహకారం అందించిన హుశేనాపురం, సోమయాజులపల్లె టీడీపీ నాయకులు, కార్యకర్తలను ఆయన అభినందించారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయ కులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విరాళాల సేకరణ

కోడుమూరు(రూరల్), సెప్టెంబరు 5: మండలంలోని ప్యాలకుర్తి గ్రామంలో సీపీఎం నాయకులు విజయవాడ వరద బాధితుల సహాయార్థం విరాళాలు సేకరించారు. ఈసందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి గఫూర్‌మియా, గొర్ల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఎర్రమద్దిలేటి మాట్లాడుతూ గ్రామంలో వసూలైన రూ.6,117లను జిల్లా పార్టీ ద్వారా సీఎం సహాయ నిధికి పంపుతున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో వీరన్న, మునుస్వామి, గిడ్డయ్య, కొత్తూరు మల్లిఖార్జున పాల్గొన్నారు.

విజయవాడకు పారిశుధ్య కార్మికులు



జెండా ఊపుతున్న కమిషనర్ పీవీ రామలింగేశ్వర్

కర్నూలు(న్యూసిటీ), సెప్టెంబరు 5: విజయవాడలో సహాయక చర్యల కోసం నగర పాలక సంస్థ రెండో బృందం గురువారం బయలుదేరింది. మరో 100 మంది కార్మికులు 20 మంది శానిటేషన్ సెక్రటరీలు బయలు దేరి వెళ్లారు. సిబ్బంది ప్రయాణించే బస్సును కమిషనర్ పీవీ రామలింగేశ్వర్, ఆరోగ్య అధికారి కే.విశ్వేశ్వరరెడ్డి జెండా ఊపి ప్రారంభిం చారు. కార్యక్రమంలో మేనేజర్ చిన్నరాముడు, శానిటేషన్ సూపర్‌వైజర్ నాగరాజు, ఇన్స్‌పెక్టర్లు రాజు, వలి, వెంకటేశ్వర్లు ఉన్నారు.

ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం

కర్నూలు(అర్బన్), సెప్టెంబరు 5: నగరంలోని డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్సిటీలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వ హించారు. ఈసందర్భంగా సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి ఇన్‌చార్జి ఉపకులపతి పీఎస్ షావలి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నైతిక విలువలతో కూడిన విద్యను అందించాలన్నారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ జహనారా, ఎన్ఎస్ఎస్ అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

● ఉస్మానియా కళాశాలలో ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ప్రిన్సిపాల్ సమీవుద్దీన్ ముజమ్మిల్ అధ్యక్షత జాబ్ మేళా వహించారు. కార్యక్రమంలో డాక్టర్ మండి అన్వర్ హుసేన్, కామర్స్ విభాగాధిపతి షేక్ రసూల్, గౌస్ పీర్, మల్లికార్జున పాల్గొన్నారు.

● క్లస్టర్ యూనివర్సిటీలో ఆవరణలోని సిల్వర్ జూబ్లీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రిజిస్ట్రార్ వెంకటేశ్వర్లు, ప్రిన్సిపాల్ వీవీఎస్ కుమార్‌లు సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిం చారు. వైస్ ప్రిన్సిపాల్ బీఆర్ ప్రసాదరెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

● రాయలసీమ యూనివర్సిటీలో సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి రిజిస్ట్రార్ ఎస్ వెంకటేశ్వర్లు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆర్ భరత్‌కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కర్నూలు(కల్చరల్): జిల్లా కేంద్ర గ్రంథాలయ ఆవరణలో ఉద్యోగులు సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిం చారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కె.ప్రకాశ్, ఉప గ్రంథాలయ అధికారి పెద్దక్క, లైబ్రేరియన్లు వజ్రాల గోవిందరెడ్డి, బాషా, పద్మావతమ్మ పాల్గొన్నారు.

● సమాజంలో ఉన్నత స్థానం గురువులదేనని రజక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాడాల నాగరాజు అన్నారు. గురువారం రాత్రి సి.క్యాంపు లోని ఎం.హెచ్ అప్పా ఎయిడెడ్ ఉన్నత పాఠశాలలో రజక సంఘం ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సంఘ నాయకులు సర్వేపల్లి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా ఉపాధ్యాయులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో రజక సంఘం జిల్లా కార్యదర్శి కేతూరి మధు, న్యాయవాది చంద్ర శేఖర్, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు పాల్గొన్నారు.

కల్లూరు: మండలంలోని ఉలిందకొండ, తనకనపల్లె ప్రభుత్వ పాఠశాలలో టీడీపీ నాయకులు ఈవీ. రమణ, సర్పంచ్ సహరాబి ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్లు షేక్షావలి, బ్రహ్మయ్య, మేమున్నిసా, అయ్యస్వామి, టీడీపీ నాయకులు శ్రీకాంత్, విక్రమ్, రాజేష్, రాముడు, వెంకటరమణ పాల్గొన్నారు.

ఓర్వకల్లు: మండలంలోని హుశేనాపురం, ఓర్వకల్లు, పూడిచెర్ల, నన్నూరులోని ప్రభుత్వ విద్యాసంస్థల్లో ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా నిర్వ హించారు. పూడిచెర్లలో హెచ్ఎం విజయలక్ష్మిని ఉపాధ్యాయులు సన్మా నించారు.

కోడుమూరు(రూరల్): మండలంలోని అమడగుంట్ల జడ్పీ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం అనంతయ్యయాదవ్ సర్వేపల్లి రాధాక్రిష్ణన్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. విద్యార్థులు గురువుల వేషధారణలతో అలరించారు.

సి.బెళగల్: ఉపాధ్యాయులు దిక్సూచి వంటివారని కోట స్కూల్ ప్రధానోపాధ్యాయుడు కిశోర్ అన్నారు. గురువారం మండలంలోని అన్ని పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో నిర్మలా వసంత కుమారి, రమా, తిమ్మన్న, మునిస్వామి, నాగన్న తదితరులు పాల్గొన్నారు.



ఉర్దూ యూనివర్సిటీలో సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అధికారులు



సిల్వర్ జూబ్లీ కళాశాలలో..



జిల్లా రజక సంఘం ఆధ్వర్యంలో సత్కారం పొందిన గురువులు



ఓర్వకల్లు మండలం పూడిచెర్లలో..



ఉలిందకొండలో..



సి.బెళగల్‌లో..

చుక్కలు చూపిస్తున్న ప్రభుత్వ వైద్యం

» మందుల కోసం ప్రైవేటు మెడికల్ షాపునకు వెళ్లాల్సిందే

» ఆ దుకాణాల నుంచి వైద్యులకు కమీషన్

కోడుమూరు, సెప్టెంబరు 4: కోడుమూరులో ప్రభుత్వ ఆస్పత్రిలో పేదలకు సరైన వైద్యం అందడం లేదన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వైద్యం పేరుతో చుక్కలు చూపిస్తున్నారు. రోగం త్వరగా నయం కావాలంటే మార్కెట్లో దొరికే మందులు తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఎదురవుతోందని రోగులు ఆందోళన చెందుతున్నారు. ఆస్పత్రిలో ఇచ్చే మందులతో జబ్బు తగ్గదని, ఇక మీ ఇష్టమని వైద్యులు తెగేసి చెబుతున్నారు. వ్యాధిని బట్టి రోజుకు రూ.2వేల నుంచి రూ.5వేల వరకు వైద్యులు మందులు రాస్తున్నారు. రోగి డిచ్చార్జి కావడానికి ముందు మెడికల్ షాపులో కనీసం రూ.2వేలు బిల్లు చేయిస్తున్నారు.

కమీషన్ల కోసమే ఆసుపత్రి మెడికల్ షాపు : కోడుమూరులోని ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రంలో కొంత మంది డాక్టర్లు కమీషన్ల కోసం కక్కుర్తిపడి ఆసుపత్రి సమీపంలో ఇతరుల చేత ఒక మెడికల్ షాపును ప్రారంభించినట్లు తెలిసింది. రక్త పరీక్షలకు మరో ల్యాబ్‌ను కూడా పెట్టించినట్లు సమాచారం. ఆసుపత్రికి వచ్చిన రోగులు బైట ల్యాబులో రక్త పరీక్షలు చేయుంచుకోవాలని, మంచి మందులు కూడా బయటే కొనుక్కోవాలని రోగి బంధువులకు పురమాయిస్తున్నారు. మందులు, రక్త పరీక్షల నుంచి వచ్చే కమీషన్ల కోసమే రోగుల బంధువుల జేబులకు చిల్లు పెడుతున్నారని పెద్ద విమర్శలు ఉన్నాయి. ఈ వ్యవహారం జిల్లా వైద్య ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లినట్లు సమాచారం. ఇటీవల ఉన్నతాధికారులు ఆసుపత్రిని తనిఖీ చేసి డాక్టర్లను హెచ్చరించి వెళ్లిన సందర్భాలు కూడా ఉన్నాయి. అయినా ఇక్కడి డాక్టర్ల పని తీరులో ఎలాంటి మార్పు లేదని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రోగుల పట్ల నిర్లక్ష్యం



కోడుమూరులోని సామాజిక ఆరోగ్య కేంద్రం

కోడుమూరు ప్రభుత్వం ఆసుపత్రికి గూడూరు, కోడుమూరు, దేవనకొండ, గోనెగండ్ల, క్రిష్ణగిరి, సి. బెళగల్ పత్తికొండ మండలాల నుంచి పెద్ద ఎత్తున రోగులు వస్తుంటారు. ఉచిత వైద్యం కోసం వచ్చే పేద ప్రజల పట్ల ఇక్కడి వైద్యులు నిర్లక్ష్యం వహిస్తున్నారని, రోగుల పట్ల దురుసుగా ప్రవర్తిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. దీంతో చాలా మంది రోగులు ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయి స్తున్నారు. దీంతో ఉదయం పూట రోగుల సంఖ్య గణనీయంగా తగ్గినట్లు తెలుస్తోంది. గతంలో 500 వరకు ఓపీలు ఉంటే ప్రస్తుతం 300లకు పడిపోయినట్లు సమాచారం. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తున్న కొంత మంది వైద్యులు కోడుమూరులోనే ప్రైవేటు క్లినిక్ నడుపుతున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి ఇక్కడి డాక్టర్ల దోపిడీకి అడ్డుకట్ట వేసి రోగులకు నాణ్యమైన ఉచిత వైద్యం అందించాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రజలకు ఉచిత వైద్యం అందిస్తున్నాం

ఆసుపత్రికి వచ్చే రోగులకు ఉచిత వైద్యం అందిస్తున్నాం. ఆసుపత్రిలో అన్ని రకాల మందులున్నాయి. రోగులకు ప్రభుత్వం అందించే మందులతోనే చికిత్సను అందిస్తున్నాం. బయట ఉన్న మెడికల్ షాపుకు మాకు ఎలాంటి సంబంధం లేదు.

- డాక్టర్ నాగరాజు, డీడీవో, కోడుమూరు

లబ్ధిదారులకు టిడ్కో ఇళ్లు ఇవ్వాలి: సీపీఐ



ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

కర్నూలు(న్యూసిటీ), సెప్టెంబరు 5: టిడ్కో, ఇందిరమ్మ ఇళ్లను లబ్ధిదారులకు ఇవ్వాలని సీపీఐ నగర కార్యదర్శి పి.రామక్రిష్ణారెడ్డి డిమాం డ్ చేశారు. సీపీఐ జాతీయ సమితి పిలుపులో భాగంగా గురువారం నగర పాలక సంస్థ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రామక్రిష్ణారెడ్డి మాట్లాడుతూ పెరుగుతున్న నిత్యావసర సరుకుల ధరల ను తగ్గించాలన్నారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్‌లను జీఎస్టీ పరిదిలోకి తీసుకు రావాలన్నారు. ప్రతి కార్డుదారుడికి 14 రకాల నిత్యావసర సరుకులు అందించాలన్నారు. సహాయ కార్యదర్శులు మహేష్, శ్రీనివా సరావు, బీసన్న, అన్వర్, నల్లన్న పాల్గొన్నారు.

ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన ఎంపీ

కర్నూలు(రూరల్), సెప్టెంబరు 5: రూరల్ మండలంలోని ఈ.తాండ్రపాడు గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంతోపాటు సచి వాలయాన్ని కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు సందర్శించారు. ఆసుపత్రిలో రోగులకు అందిస్తున్న సేవల గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్య కేంద్రం గ్రామం లోపల ఉన్నందున స్థానికులు తీఇబ్బందులు పడుతున్నారని వైద్య సిబ్బంది ఎంపీ దృష్టికి తీసుకొచ్చారు. మెయిన్ రోడ్డునుంచి ఆసుత్రికి వెళ్లే ప్రధాన రహదారి వెంట వీధి దీపాలు ఏర్పాటు చేయాలని కోరారు. ఆసుపత్రి ఆవరణంలో డూమ్ లైట్లు, రోగుల సహాయకులకు షెడ్డు నిర్మించాలని కోరారు. అధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కరిస్తానని ఆయన తెలిపారు. అనంతరం గ్రామ సచివాలయానికి వెళ్లి ఉద్యోగుల రికార్డులను పరిశీలించారు.

ప్రైవేటు ల్యాబ్‌లపై చర్యలు తీసుకోవాలి

కర్నూలు(హాస్పిటల్), సెప్టెంబరు 5: ప్రభుత్వ అనుమతి లేకుండా డెంగీ నిర్ధారణ పరీక్షలు చేస్తున్న ప్రైవేటు హాస్పిటల్ ల్యాబ్‌లపై చర్యలు తీసుకోవా లని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు కె.శ్రీనివాసులు డిమాండ్ చేశారు. గురువారం అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) ఆధ్వర్యంలో ఆయన డీఎంహెచ్‌వో కార్యాలయ ఏవో కే.అరుణకి వినతి పత్రం సమర్పిం చారు. కురుస్తున్న వర్షాలకు పిల్లల నుంచి పెద్దల వరకు జ్వరాలు వ్యాపించి తీవ్ర ఆందోళనలతో ప్రైవేటు హాస్పిటల్స్‌కు వెళితే ఇదే అదు నుగా అక్కడి ప్రైవేటు హాస్పిటల్ ల్యాబ్‌లు ఇష్టానుసారంగా డెంగీ పరీక్షలు నిర్వహిస్తూ భయాందోళనలు కల్పిస్తున్నారన్నారు. నాయకులు బీసన్న, నాగేశ్వర రావు , సురేంద్ర యాదవ్ పాల్గొన్నారు.

వంద రోజుల్లో పూర్తి చేయండి: ఎంపీడీవో

కోడుమూరు(రూరల్), సెప్టెంబరు 5: ప్రభుత్వం మంజూరు చేసిన ఇళ్లను వందరోజుల్లో పూర్తి చేసుకోవడానికి లబ్ధిదారులు కృషి చేయాలని ఎంపీడీవో చంద్రశేఖర్ తెలిపారు. గురువారం ప్యాలకుర్తి ప్రభుత్వ లేఅవుట్‌ను ఎంపీడీవో సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ లబ్ధిదారులు పెండింగ్ పనులు త్వరితగతిన పూర్తి చేసి గృహప్రవేశం చేయాలని కోరారు.

తహసీల్దార్‌ను కలిసిన ప్రజాప్రతినిధులు

ఓర్వకల్లు, సెప్టెంబరు 5: ఓర్వకల్లు తహసీల్దార్‌గా పదవీ బాధ్యతలు చేపట్టిన వెంకటరమణను గురువారం జడ్పీటీసీ సభ్యులు రంగనాథగౌడు, ఎంపీపీ తిప్పన్న మర్యాదపూర్వకంగా కలిశారు. తహసీల్దార్‌కు పూలబొకే అందజేసి సన్మానించారు.

'ధరలను నియంత్రించాలి'



ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

ఓర్వకల్లు, సెప్టెంబరు 5: నిత్యావసర వస్తువుల ధరలను ప్రభుత్వం నియంత్రించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు జగన్నాథం, మండల కార్యదర్శి రమేష్ డిమాండ్ చేశారు. గురువారం ఓర్వకల్లులోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం జూనియర్ అసిస్టెంట్ రవికుమార్‌కు వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బియ్యం, కంది పప్పు, నూనే, కూరగా యలు, పెట్రోల్, డీజిల్ ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయన్నారు. ప్రతి కార్డుదారుడికి 14 రకాల నిత్యావసర సరుకులు అందించాలన్నారు. నాయకులు సుధాకర్, మహబూబ్ బాషా, వలి, సురేష్, రంగన్న, దస్తగిరి, చిన్నరాజు, వెంకటేశ్ పాల్గొన్నారు.

మట్టి విగ్రహాలు నెలకొల్పాలి: సీఐ

కోడుమూరు, సెప్టెంబరు 5: పర్యావరణ పరిరక్షణ కోసం ప్రజలంతా వినాయక మట్టి విగ్రహాలను నెలకొల్పాలని సీఐ తబ్రేజ్ అన్నారు. బృం దావన్ ఫ్యాన్సీ స్టోర్ యాజమాని జనార్దన్, సీఐ ప్రజలకు వినాయక మట్టి విగ్రహాలను గురువారం ఉచితంగా పంపిణీ చేశారు. సీఐ మాట్లాడుతూ జనార్దన్ ప్రతి ఏడాది మట్టి విగ్రహాలను ప్రజలకు ఉచితంగా పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ రఘునాథ్‌రెడ్డి, సీపీఐ నాయకులు క్రిష్ణ, నాగార్జున స్కూల్ డైరెక్టర్ సత్యరెడ్డి, పెద్దలు మల్లారెడ్డి పాల్గొన్నారు.

జూనియర్ కళాశాలలో వైద్యశిబిరం

కోడుమూరు(రూరల్), సెప్టెంబరు 5: కోడుమూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. కిమ్స్ కర్నూలు ఆసుపత్రి వైద్యసిబ్బంది దాదాపు 200 మందికి బీపీ, షుగర్, ఈసీజీ, 2డీ ఎకో పరీక్షలు నిర్వహించారు. వైద్యబృందం, ప్రిన్సిపాల్ పద్మావతి, అధ్యాపకులు పాల్గొన్నారు.

వెల్ఫేర్ అసిస్టెంట్లకు పనిభారం తగ్గించండి



ఎంపీడీఓకు వినతిపత్రం ఇస్తున్న వెల్ఫేర్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్లు

కల్లూరు, సెప్టెంబరు 5: ప్రభుత్వ పాఠశాలల్లో వెల్ఫేర్, ఎడ్యుకేషన్ అసిస్టెంట్లకు పనిభారం తగ్గించాలని సచివాలయ ఉద్యోగులు డిమాండ్ చేశారు. గురువారం కల్లూరు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ, ఎంఈఓకు కల్లూరు మండల వెల్ఫేర్, ఎడ్యుకేషన్ అసిస్టెంట్లు వినతిపత్రం అందించారు. పాఠశాలలో బాత్రూం ఫోటోలు క్యాప్చర్ చేయాలనే ఉత్తర్వులు ఉపసంహరించుకోవాలని కోరారు.

విద్యార్థి జీవితంలో గురువు స్థానం ప్రత్యేకం



కార్డియాలజి ప్రొఫెసర్‌ను సన్మానిస్తున్న వైద్యులు, పీజీ విద్యార్థులు

కర్నూలు(హాస్పిటల్), సెప్టెంబరు 5: విద్యార్థి జీవితంలో, ఉన్నతి సాధించడంలో గురువుదే ప్రత్యేక స్థానమని కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల కార్డియాలజీ సీనియర్ ప్రొఫెసర్ డా.పి. చంద్రశేఖర్ అన్నారు. గురువారం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రి కార్డియాలజీ విభాగంలో టీచర్స్ డే సందర్భంగా తమకు విద్యాబుద్ధులు నేర్పిన కార్డియాలజీ ప్రొఫెసర్ డా.పి. చంద్రశేఖర్ పీజీ వైద్య విద్యార్థులు క్యాత్‌లాబ్ యూనిట్‌లో సన్మానించారు. ఈ కార్యక్రమంలో కార్డియాలజీ విభాగపు అసిస్టెంట్ ప్రొఫెసర్ ప్రశాంత్, కిరణ్ కుమార్ రెడ్డి, రవికిరణ్, బిందు లలిత కుమారి, పీజీలు మహేష్, సత్యకుమార్, నవాజ్, శ్రీకాంత్, రవికిషోర్, క్యాత్‌ల్యాబ్ టెక్నీషియన్ దివ్య భారతి గౌరి పాల్గొన్నారు.

మెగా రక్తదాన శిబిరం



రక్తదాన శిబిరంలో ఎంపీ బస్తిపాటి నాగరాజు, ఎమ్మెల్యే గౌరు చరిత, డాక్టర్ కేవీ సుబ్బారెడ్డి తదితరులు

కర్నూలు(కల్చరల్), సెప్టెంబరు 5: ఇంటర్‌నెట్ ద్వారా యువతకు ఉపాధి రంగంలో అవకాశాలు కల్పిస్తున్న లెవ్ యుగ్ సంస్థ తొలి వార్షికోత్సవం సందర్భంగా మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. నగర శివారు దూపాడులోని డాక్టర్ కేవీ సుబ్బారెడ్డి ఇంజనీరింగ్ కళాశాల్లో ఏర్పాటు శిబిరం ఏర్పాటు చేసిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ లెవ్ యుగ్ సంస్థ యువతలోని నైపుణ్యాలను, కొత్త ఆవిష్కరణలను ప్రోత్సహించడం సంతోషకరమని అన్నారు. యువతకు లెవ్ యుగ్ సంస్థ అందిస్తున్న ప్రోత్సాహకాలు స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నాయని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి అన్నారు. విద్యావేత్త డాక్టర్ కేవీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ లెవ్ యుగ్ సంస్థ యువత ఆలోచనలను వ్యాపారాలుగా మార్చే అవకాశాన్ని కల్పించడం అభినందనీయమన్నారు.

రోడ్డును పరిశీలించిన ఎమ్మెల్యే



వర్షానికి కొట్టుకుపోయిన రోడ్డును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే దస్తగిరి

సి.బెళగల్, సెప్టెంబరు 5: మండలంలోని పోలకల్లు-బ్రాహ్మణదొడ్డి గ్రామాల మధ్య వర్షానికి కొట్టుకుపోయిన రోడ్డును కోడుమూరు ఎమ్మెల్యే దస్తగిరి, పంచాయతీరాజ్‌శాఖ అధికా రులు, ఎంపీడీవో రాముడు, టీడీపీ నాయకులు పరిశీలించారు. ఆయా గ్రామాలకు రాకపోకలు బంద్ కావ డంతో వెంటనే బిడ్జి నిర్మించాలని ఎమ్మెల్యే అధికారులకు ఆదేశించారు. ఎమ్మెల్యే వెంట మాజీ జడ్పీటీసీ చంద్రశేఖర్, టీడీపీ మాజీ మండల కన్వీనర్ తిమ్మప్ప, అమర్, భాస్కర్, శంకర్ ఉన్నారు.

వృథాగా మినీ ట్యాంకులు



పెంచికలపాడులో నిరుపయోగంగా మినీ ట్యాంకులు

గూడూరు, సెప్టెంబరు 5: మండలంలోని పెంచికలపాడు గ్రామంలో మినీ ట్యాంకులకు నీటి సరఫరా చేసే మోటారు పనిచేయకపోవడంతో ప్రజలు నీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు. పెంచికలపాడులో గూడూరు రహదారిలో ఉన్న మినీ ట్యాంకులు మోటారు పని చేయక దాదాపు నెల రోజుల నుంచి వృథాగా ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి మోటారుకు మరమ్మతు చేయించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

పత్తికి తెగుళ్లు రైతుకు దిగులు


చెట్నహళ్లి గ్రామంలో తెగులు సోకిన పత్తి


రైతు భీమక్క

- భారీ వర్షాలతో ఎర్రబారి రాలిపోతున్న కాయలు
- పెట్టుబడి కూడా రాదని రైతుల ఆవేదన

మంత్రాలయం, సెప్టెంబరు 5: పత్తికి ఎర్రకుళ్లు, ఆకుపచ్చ తెగుళ్ల సోకడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మంత్రాలయం, ఎమ్మిగనూరు, ఆదోని నియోజకవర్గాల్లో ఖరీఫ్‌కు గాను జూన్ నెలలో 1,02,780 ఎకరాల్లో పత్తి సాగు చేశారు. కాగా మంత్రాలయం, కౌతాళం, పెద్దకడుబూరు, కోసిగి, నందవరం మండలాల్లో భారీ వర్షాలు కురియడంతో కాయకుళ్లు తెగులు సోకింది. దీంతో కాయలు ఎర్రగామారి ముడుచుకుపోయాయి. దిగుబడి వచ్చే సమయంలో ఇలా కావడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. దాదాపు 800 హెక్టార్లలో పత్తి పంట పూర్తిగా నష్టపోయినట్లు అధికారులు అంచనా వేస్తున్నారు.

పెట్టుబడి కూడా వచ్చే అవకాశం లేదు

ఎకరాకు రూ.25వేల నుంచి రూ.30వేల వరకు కాగా తెగులు సోకడంతో ఎకరాకు రూ.12వేల లోపే ధర పలుకుతుందని పెట్టుబడి కూడా వచ్చే అవకాశం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కొంప ముంచిన వర్షం

ఇటీవల భారీ వర్షాలు కురియడంతో కాయకుళ్లు తెగులు సోకింది. దీంతో కాయలు ఎర్రబారి, పగిలి పత్తి రాలేనంతా ముడుచుకుపోయింది. మరో రెండు రోజుల్లో ఎండ వస్తే తప్ప పంటలు చేతికందే పరిస్థితి లేదని రైతులు వాపోతున్నారు.

పత్తి పూర్తిగా ఎర్రబారింది.

రెండెకరాలు కౌలుకు తీసుకుని పత్తి సాగు చేశాను. భారీ వర్షాలతో కాయలు ఎర్రగా మారి కాయలు, పిందె, పూత రాలిపోతుంది. కోసేందుకు వీలుకావడం లేదు. ప్రభుత్వం మమ్మల్ని ఆదుకోవాలి. **- బోయ నాగేంద్ర, చెట్నహళ్లి గ్రామం**

నష్టం అంచనా వేస్తున్నాం

పంట నష్టాన్ని అంచనా వేస్తున్నాం. ఎండవస్తే తేమశాతం తగ్గి తెగుళ్లను నివారించే అవకాశముంది. రైతులు వర్షం కురిసిన తర్వాత పొటాషియం నైట్రేట్ గ్రాములు లీటరు నీటితో కలిపి పిచికారీ చేసుకోవాలి. కాపర్ ఆక్సీ క్లోరైడ్ లీటరు నీటికి 3 గ్రాములు కలిపి పిచికారీ చేయాలి.
-మహ్మద్ ఖాద్రి, ఏడీఏ, ఎమ్మిగనూరు


పుప్పాల దొడ్డిలో పంట చూపుతున్న ఓబులేసు

ఆస్పరి: మండలంలో 16 వేల హెక్టార్లలో పత్తి పంట సాగు చేశారు. బిల్లేకల్లు, కైరుప్పలు, పుప్పాలదొడ్డి, కారుమంచి, కల్లపరి, తంగరడోణ, బైలు పత్తికొండ, డొడగొండ, తురువగల్లు, యాటకల్లు, హలిగేర తదితర గ్రామాల్లో పత్తి సాగు చేశారు. పంట చేతికొచ్చే సమయంలో కురిసిన భారీ వర్షానికి పత్తికాయలు నల్ల బారి నేల రాలాయి. దిగుబడి ప్రశ్నార్థకంగా మారిందని సాగు చేసిన రైతులు వాపోతున్నారు. పంట నష్టం అంచనా వేస్తున్నామని, నివేదిక పంపి పరిహారం వచ్చేలా చూస్తామన్నామని ఏవో నరేంద్ర కుమార్ తెలిపారు.

వరద బాధితులకు ఆర్థిక సాయం

తుగ్గలి, సెప్టెంబరు 5: విజయవాడ వరద బాధితులకు విరాళం ఇస్తున్నట్లు టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి తుగ్గలి నాగేంద్ర తెలిపారు. తన వంతుగా రూ.రూ.1లక్ష, పాటిల్ ఈశ్వర్ రెడ్డి రూ.85వేలు, బత్తిన వెంకట్రాముడు రూ.50వేలు, మనోహర్ చౌదరి రూ.50వేలు, సత్యనారాయణ రూ.50వేలు కలిపి గ్రామస్తుల విరాళాలతో రూ.8 లక్షలు సేకరించామన్నారు. ఈ మొత్తాన్ని ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబుకు అందజేస్తామని తెలిపారు.

కోటీశ్వరుల చేతుల్లో దేశ సంపద

పత్తికొండ టౌన్, సెప్టెంబరు 5: ప్రధాని మోదీ చెప్పినట్లుగా దేశంలో సంపద పెరుగుతోందని, అది కోటీశ్వరుల చేతుల్లో ఉందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు రామచంద్రయ్య ధ్వజమెత్తారు. నిత్యావసర ధరలను తగ్గించాలని కోరుతూ గురువారం పట్టణంలో భారీ ప్రదర్శన నిర్వహించారు. దేశంలో ఇప్పటికీ 30 శాతం మంది నిరుపేదలకు కడుపు నిండా తిండి లేదన్నారు. నల్లధనాన్ని తీసుకువచ్చి పేదల ఖాతాల్లో రూ.15 లక్షల చొప్పున జమ చేస్తాన్న హామీ ఏమైందనాన్నరు. అనంతరం రెవెన్యూ అధికారులకు వినతి పత్రం అందజేశారు. రాజాసాహెబ్, రామాంజనేయులు, కారన్న, గురుదాస్, వీరన్న, తిమ్మయ్య, నెట్టికంటయ్య, గిడ్డయ్య పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి

మంత్రాలయం, సెప్టెంబరు 5: వర్షాల ప్రభావంతో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో మణిమంజరి సూచించారు. గురువారం కల్లుదేవకుంట పీహెచ్‌సీ తనిఖీ చేశారు. రోగులను, గర్భిణులకు, బాలింతలకు వైద్యసేవల వివరాలు అడిగి తెలుసుకున్నారు. వైద్యాధికారి గోవిందమ్మ, డీటీ సరస్వతి, వేణుగోపాల్, రాణి, నీలకంఠ రాజు పాల్గొన్నారు.

ఎకరాకు రూ.50వేల పరిహారం ఇవ్వాలి

మద్దికెర, సెప్టెంబరు 5: వర్షాలకు పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.50వేల పరిహారం ఇవ్వాలని సీపీఐ కార్యదర్శి నాగరాజు, గురువారం ఏవో రవిని కోరారు. ఏవో జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళతామని హామీ ఇచ్చారు. హనుమన్న, కోదండరాముడు కోరారు.
5ఏడీఎన్10 : మట్టి వినాయక విగ్రహాన్ని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌కి అందజేస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

మట్టి విగ్రహాలను ప్రతిష్టించాలి


సబ్ కలెక్టర్‌కు విగ్రహాలను అందచేస్తున్న క్లబ్ సభ్యులు

ఆదోని (అగ్రికల్చర్), సెప్టెంబరు 5: పర్యావరణ పరిరక్షణకు మట్టి విగ్రహాలను ప్రతిష్టించాలని రోటరీ క్లబ్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సందీప్ రెడ్డి, డాక్టర్ షైషల్ల కోరారు. గురువారం 600 మట్టి విగ్రహాలను పంపిణీ చేశారు. సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, డీఎస్పీ సోమన్న, అధికారులకు మట్టి విగ్రహాలను అందజేశారు. పీవోపీతో పర్యావరణానికి ప్రమాదం ఉందన్నారు. రఘునాథ్ రెడ్డి హితేష్ జీవన్ రెడ్డి, సునీల్ రెడ్డి, భరత్ ప్రశాంత్ గాంధీ, రాయచోటి సుబ్బయ్య, పద్మనాభయ్య శెట్టి, మురళీధర్, శ్రీధర్ రెడ్డి పాల్గొన్నారు.

శాంతి భద్రతలను పరిరక్షిస్తా : డీఎస్పీ


శ్రీనివాసాచారి

ఎమ్మిగనూరు టౌన్, సెప్టెంబరు 5: ఎస్పీ ఆదేశాల మేరకు శాంతి భద్రతలను పరిరక్షిస్తానని ఇన్‌చార్జి డీఎస్పీ శ్రీనివాసాచారి అన్నారు. గురువారం ఆయన కార్యాలయంలో మాట్లాడుతూ ఎమ్మిగనూరు, మంత్రాలయం గణేష్ ఉత్సవాల్లో అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఇన్‌చార్జి డీఎస్పీగా ఎస్పీ బిందుమాధవ్ నియమించారని తెలిపారు.

ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీలు

ఎమ్మిగనూరు టౌన్, సెప్టెంబరు 5: స్థానిక నవోదయ టాపర్ కోచింగ్ సెంటర్‌లో ఫుడ్ సేఫ్టీ అధికారులు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందడం లేదని తమకు భారత ఐక్య ఐక్య విద్యార్థి ఫెడరేషన్ నుంచి ఫిర్యాదు అందిందన్నారు.

రైతులను ఆదుకోవాలి

నందవరం, సెప్టెంబరు 5: వర్షాలతో పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని ఎల్లెల్సీ మాజీ డైరెక్టర్ గడ్డం నారాయణ రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం మాట్లాడుతూ పంట నష్టాన్ని జాతీయ విపత్తుగా ప్రకటించి, బీమా అమలు చేయాలని కోరారు.

పథకాలు లబ్ధిదారులకు అందేలా చూడాలి

గోనెగండ్ల, సెప్టెంబరు 5: దళిత, గిరిజన ప్రభుత్వ పథకాలు నేరుగా లబ్ధిదారులకు అందేలా చూడాలని జైభీమ్ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు చిక్కం జానయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని కులుమాల గ్రామంలో మాట్లాడారు. బుజ్జిబాబు, రత్నమయ్య, చిన్నహనుమంతు, జయరాజ్, రాజు, లాజర్, యాకోబ్, అనిల్, రాణాప్రతాప్, సోమేష్, ఎల్లప్ప, దేవదానం, పాల్గొన్నారు.

పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించాలి



ధర్నా చేస్తున్న నాయకులు

తుగ్గలి, సెప్టెంబరు 5: పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గించాలని సీపీఐ కార్యవర్గ సభ్యులు నబి రసూల్, మండల అధ్యక్షుడు సుల్తాన్ డిమాండ్ చేశారు. గురువారం తుగ్గలి బస్టాండు నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి ధర్నా నిర్వహింయారు. తుగ్గలి రైల్వే బ్రిడ్జి కింద రహదారికి మరమ్మతులు చేయాలని కోరారు. అనంతరం ఆర్ఐ సుధాకర్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు. వెంకటేశ్, నాగరాజు, పీరా, చిరంజీవి ఉన్నారు.
గోనెగండ్ల: సీపీఐ నాయకుడు మద్దిలేటినాయుడు, కార్యదర్శి నాగప్ప డిమాండ్ చేశారు. గురువారం కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం వినతి పత్రం అందజేశారు. మాలిక్, పూజారి మునిస్వామి, దాదావలి, జబ్బర్, కాజ, మల్లికార్జున, ఎల్లప్ప, జయరామ్, హనుమంతు, తిమ్మగురుడు, నరసప్ప, సుంకన్న పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

ఆలూరు, సెప్టెంబరు 5: పట్టణంలోని గుంతకల్ రోడ్డు వద్ద ఓ ఏడుగురిని అదుపులోకి తీసుకున్నారు. ఆలూరు సీఐ శ్రీనివాస నాయక్, ఎస్ఐ వెంకటనరసింహులు తెలిపిన మేరకు.. నిందితుల నుంచి రూ.55,560 నగదును స్వాధీనం చేసుకున్నారు. మరో వ్యక్తి పరారీలో ఉన్నాడని సీఐ తెలిపారు.

ఉత్సవాల్లో అల్లర్లకు పాల్పడవద్దు: సీఐ

మంత్రాలయం, సెప్టెంబరు 5: గణేష్ ఉత్సవాల్లో అల్లర్లకు పాల్పడవద్దని సీఐ రామాంజులు అన్నారు. గురువారం మాధవరం పోలీస్ స్టేషన్‌లో శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. భక్తి పాటలతో జరుపుకోవాలని, మద్యం సేవించరాదన్నారు. ఎస్ఐ పరమేష్ నాయక్, ఏఎస్ఐ బందెనవాజ్, వీరాంజనేయులు, రామక్రిష్ణ, వీరేష్ పాల్గొన్నారు.
నందవరం: చవితి వేడుకల్లో అల్లర్లకు పాల్పడితే సహించేది లేదని స్టేషన్ ఇన్‌చార్జ్ సుభాన్ తెలిపారు. గురువారం పోలీస్టేషన్‌లో సమావేశం ఏర్పాటు చేశారు. మండపాల వద్ద, నిమజ్జనం రోజు డీజేలు పెడితే కేసులు నమోదు చేస్తామన్నారు.

ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం


ఆదోని నెహ్రూ మెమోరియల్ పాఠశాలలో ఉపాధ్యాయులు

ఆదోని (అగ్రికల్చర్), సెప్టెంబరు 5: పట్టణంలోని పాఠశాలల్లో గురుపూజోత్సవ వేడుకలు గురువారం నిర్వహించారు. ముందుగా సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి ఉపాధ్యాయులు పూలమాలవేసి నివాళి అర్పించారు. మున్సిపల్ హైస్కూల్లో డిప్యూటీ ఈవో వెంకటరమణ రెడ్డి, ఎంఈవో రాజేంద్రప్రసాద్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఎంఈవో 2 శ్రీనివా సులు, హెచ్ఎంలు మల్లికార్జున, ఫయాజుద్దీన్, నాగరాజు, రవి పాల్గొన్నారు. నెహ్రూ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం అలీమ్ సిద్దికి ఆధ్వర్యంలో, ఆర్ఆర్ లేబర్ కాలనీ పురపాలక ఉన్నత పాఠశాలలో హెచ్ఎం రమేష్ నాయుడు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఉపాధ్యాయులు సుధాకర్, లోక్యా నాయక్, ప్రహ్లాద, ప్రసాద్, అనిల్, కోటన్న పాల్గొన్నారు. మిల్టన్ గ్రామర్ పాఠశాలలో, అమరావతి ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో గురుపూజోత్సవ వేడుకలు చేశారు.


ఆలూరు: నివాళి అర్పిస్తున్న ఎంఈవోలు


మంత్రాలయం: ఉపాధ్యాయులకు సన్మానం

ఆలూరు: ఉపాధ్యాయ దినోత్సవం గురువారం అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో ఘనంగా నిర్వహించారు.. ఆలూరు ఎంఆర్‌సీ భవన్‌లో ఎంఈవోలు కోమల దేవి, చిరంజీవి రెడ్డి సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాల వేశారు.
మంత్రాలయం: ఎంఈవో రాగన్న, హెచ్ఎంలు అంపయ్య, బోజరాజు, లచ్చప్ప, జాన్సన్, రామ్మోహన్, వీరేష్, శాంతి, లక్ష్మీకాంతం, రామకృష్ణ, శ్రీనివాసులు సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. బంగారప్ప, బీమేష్, సుజాత పాల్గొన్నారు.
పత్తికొండ టౌన్: జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో సర్వేపల్లికి నివాళి అర్పించారు. అనంతరం హెచ్ఎం భ్రమరాంబను సత్కరించారు. ఉపాధ్యాయులు సత్యనారాయణ, రుక్మిణి పాల్గొన్నారు.

ప్రజలకు సక్రమంగా సేవలందించండి: సబ్ కలెక్టర్


సిబ్బందితో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ భరద్వాజ్

ఎమ్మిగనూరు రూరల్, సెప్టెంబరు 5: కార్యాలయానికి వచ్చే ప్రజలకు సేవలు సక్రమంగా అందించాలని ఆదోని సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్ సూచించారు. గురువారం ఆయన ఎమ్మిగనూరు తహసీల్దార్ కార్యాలయాన్ని పరిశీలించారు. అధికారులు, సిబ్బందితో మాట్లాడారు. ప్రజా సమస్యలను నిర్లక్ష్యం చేయవద్దని అన్నారు. తహసీల్దార్ శేషఫణి, పోలీసులు పాల్గొన్నారు.

ఈ-క్రాప్ తప్పనిసరి

పత్తికొండ టౌన్, సెప్టెంబరు 5: ఖరీఫ్‌లో పంటలు సాగుచేసిన రైతులంతా ఈక్రాఫ్‌లో 15వ తేదీలోగా తప్పక నమోదు చేసుకోవాలని ఏవో వెంకట్రాముడు సూచించారు. గురువారం చిన్నహుల్తి, జూటూరు, దేవనబండ, నలుగుదొడ్డి గ్రామాల్లో రైతు సేవా కేంద్రాలను ఏవో తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. రైతులకు ఈక్రాఫ్ బుకింగ్ చేయించే బాధ్యత రైతు సేవా కేంద్రం సిబ్బందిదే అని సూచించారు. ఈకేవైసీ చేయించుకోవడం ద్వారా ఉచిత పంటల బీమా అకాల వర్షాలతో పంట నష్టపరిహారం, మద్దతు ధర తదితర సౌకర్యాలు పొందవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో రైతు సేవా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

మెడికల్ కళాశాల పనులను కొనసాగించాలి

ఎమ్మిగనూరు రూరల్, సెప్టెంబరు 5: ఆదోని మెడికల్ కళాశాల పనులను కొనసాగించాలని సీపీఎం నాయకులు గోవిందు, సీఐటీయూ నాయకులు రాముడు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. పశ్చిమ ప్రాంతం విద్య, వైద్య సౌకర్యాల్లో వెనుకబడి ఉందని, కరువుకాటకాల్లో ఉందన్నారు. ఈ ప్రాంతంలో మెడికల్ కళాశాలను ఏర్పాటు చేయడం ఆనందం కలిగించిందన్నారు. అయితే పనులను నిలిపివేయాలని ప్రభుత్వం ఇచ్చిన మెమో ఇవ్వడం నిరాశ కలిగించిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇక్కడ మెడికల్ కళాశాల ప్రారంభమైతే ఎమ్మిగనూరు, మంత్రాలయం, ఆదోని, పత్తికొండ ప్రజలకు వైద్యసేవలు అందేతాయని అన్నారు. పనులు తిరిగి ప్రారంభించకుంటే సీపీఎం, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన ఉధృతం చేస్తామని తెలిపారు. అనంతరం డీటీ శ్రీదేవికి వినతిపత్రం అందజేశారు. రమేష్, మోహిన్, మహేష్, కృష్ణ, రాఘవరెడ్డి పాల్గొన్నారు.

రహదారి కష్టాలు


ప్రధాన రహదారిపై నిల్వ ఉన్న మురుగునీరు

ఆస్పరి, సెప్టెంబరు 5: మండలంలో రోడ్లపైనే వర్షపునీరు ఉన్నా, అధికారులకు పట్టడం లేదు. పారిశుధ్య పను చేయకపోవడంతో జాతీయ రహదారితో పాటు ఆస్పరిలోని కాలనీలలో మురుగు నీరు నిలిచి దుర్వాసన వస్తోందని ప్రజలు, దుకాణదారులు వాపోతున్నారు. దోమలు, ఈగలు వ్యాప్తి చెంది, రోగాలు ప్రబలే ప్రపమాదముందని పంచాయతీ అధికారులు స్పందించాలని కోతున్నారు.

దుకాణం షట్టర్ ధ్వంసం


ధ్వంసమైన షట్టర్

ఎమ్మిగనూరు, సెప్టెంబరు 5: పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో ఓ వ్యాపారికి చెందిన (ఎస్.42) దుకాణం షట్టర్‌ను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేసిన ఘటన గురువారం వెలుగు చూసింది. యజమాని శ్రీనివాసులు తెలిపిన మేరకు.. మార్కెట్ యార్డులో ధనలక్ష్మి ట్రేడింగ్ దుకాణం ఎస్.42లో నిర్వహిస్తున్నారు. రోజు మాదిరిగానే బుధవారం రాత్రి దుకాణానికి తాళాలు వేసి వెళ్లిపోయారు. గురువారం ఉదయం వచ్చి దుకాణం తెరవగా షట్టర్ ధ్వంసం చేసి ఉడటంతో గమనించగా రూ.30వేల చోరీ జరిగింది. అయితే వ్యాపారులు, కమీషన్ ఏజెంట్లు పోలీసులకు ఫిర్యాదు చేయలేదని సమాచారం. కాగా మార్కెట్ యార్డులో 30కి పైగా సీసీ కెమెరాలు ఉన్నా వాటిలో చాలావరకు పనిచేయడం లేదని సమాచారం.

వరద బాధితుల సహాయానికి సీఎం కృషి



- మూడు నెలల వేతనం, రూ.5లక్షల విరాళం: ఎమ్మెల్యే బీవీ

ఎమ్మిగనూరు, సెప్టెంబరు 5: వరద బాధితులను ఆదుకునేందుకు సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి అన్నారు. గురువారం ఆయన వరద బాధితులకు రూ.5లక్షల విరాళం ఇస్తున్నట్లు ప్రకటించారు. తన మూడు నెలల గౌరవ వేతనం, అలవెన్సులు కలిపి రూ. 5లక్షల చెక్కును సీఎం సహాయనిధికి పంపుతున్నట్లు తెలిపారు. ప్రతిపక్ష నాయకుడు వైఎస్ జగన్ సాయం చేయకపోగా ప్రభుత్వంపై విమర్శలు చేయడం దారుణమన్నారు. బాధితులను ఆదుకునేందుకు సినీతారలు, పారిశ్రామికవేత్తలు, వ్యాపారులు సహకారం ఇస్తున్నారని అన్నారు.

టౌన్ బ్యాంకు నూతన పాలకవర్గం..

ఎమ్మిగనూరు కో-ఆపరేటివ్ టౌన్ బ్యాంకు పాలకవర్గం ఏర్పాటుకు కోఆపరేటివ్ అధికారికి ప్రతిపదనలు పంపినట్లు ఎమ్మెల్యే తెలిపారు. అధ్యక్షుడిగా ప్రతాప్ ఉరుకుందయ్య శెట్టి, ఉపాధ్యక్షుడిగా బండా నరసప్ప, డైరెక్టర్లుగా మహబూబ్‌బాషా, ఉప్పర రవికుమార్, దోమా భీమేష్, వాల్మీకి రాజు, వెంకటేశ్వరరెడ్డి, కదిరికోట షాలేమ్, తోట నరసింహులు, ఆడిమి నవీన్‌కుమార్, రిటైర్డు సీఈవో మాచాని బాలగంగాధర్ పేర్లను ప్రతిపాదించామని ప్రభుత్వం త్వరలో ఉత్తర్వులు జారీ చేసుందని అన్నారు.

హాస్టల్ భవనాల పరిశలన..

ఇందిరానగర్, ఎన్టీఆర్ కాలనీల్లో శిథిలావస్థలో ఉన్న సాంఘిక సంక్షేమ హాస్టళ్ల భవనాలను ఆయన పరిశీలించారు. నూతన భవనాల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపుతున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు.

సైబర్ మోసాలపై అవగాహన కల్పించండి

ఆలూరు, సెప్టెంబరు 5: గ్రామ ప్రజలకు సైబర్ మోసాలపై అవగాహన కల్పించాలని ఆలూరు సీఐ శ్రీనివాస నాయక్ సూచించారు. గురువారం ఆలూరు సర్కిల్ కార్యాలయంలో గ్రామ సచివాలయం మహిళా పోలీసులతో సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో రాజకీయ కదలికలు, వివాదాస్పద ఘటనలపై నిఘా ఉంచాలని కోరారు. వీటిపై తమకు ఎప్పటికప్పుడు సమాచారం అందించాలని అన్నారు. ఈ సమావేశంలో ఆలూరు ఎస్సై వెంకట నరసింహులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సీఐ శ్రీనివాస నాయక్

పంట బీమా అమలు చేయాలి

పెద్దకడుబూరు ,సెప్టెంబరు 5: వర్షాలతో పంటలు నష్టపోయిన రైతులకు పంట బీమా అమలు చేయాలని ఏఐకెఎంఎస్ నాయకులు సత్యన్న డిమాండ్ చేశారు .గురువారం తహసీల్దార్ కార్యాలయంలో ఆర్ఐ మహేష్‌కు వినతి పత్రం అందజేశారు. ఎడతేరపి లేని వర్షాలను జాతీయ విపత్తుగా ప్రకటించాలని కోరారు. .ఎకరానికి రూ 25వేల పరిహారం అందించాలని కోరారు. సీపిఐ(ఎంఎల్) కార్యదర్శి నాగరాజు, ఐఎఫ్‌టియూ బాలరాజు,ఏఐకేఎంఎస్ నాయకులు హనుమంతు, నాగేంద్ర,బాబు, రామాంజి, వీరయ్యలక్ష్మణ్ పాల్గొన్నారు.

మెనూ పాటించకుంటే చర్యలు

గోనెగండ్ల, సెప్టెంబరు 4: మధ్యాహ్న భోజనంలో మెనూ పాటించకుంటే వంట ఏజెన్సీలపై చర్యలు తప్పవని ఎంఈవో నీలకంఠ హెచ్చరించాడు. బుధవారం ఎమ్మార్సీ భవనంలో సమావేశం నిర్వహించారు. పోషకాహరాలతో నాణ్యమైన భోజనం, తగిన మోతాదులో ఇవ్వాలని అన్నారు. సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు

విద్యార్థుల రక్తదానం

ఆలూరు, సెప్టెంబరు 5: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో గురువారం జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ విద్యార్థులు రక్తదానం చేశారు.. రాష్ట్ర కార్యదర్శి హరిప్రసాద్ యాదవ్ మాట్లాడుతూ రక్తదానం ఎందరో ప్రాణాలని నిలబెడుతుందన్నారు. రక్తదానం చేసిన విద్యార్థులను ప్రిన్సిపాల్ రమాదేవి, అధ్యాపకులు కృపాకర్, సుమన్ రాజ్ అభినందించారు..

రూ. 5 లక్షల విరాళం

ఆదోని టౌన్, సెప్టెంబరు 5: వరద బాధితుల సహాయర్థం మహాయోగి లక్ష్మమ్మ బ్యాంక్ చైర్మన్ రాచోటి రామయ్య రూ.5లక్షల విరాళాన్ని అందజేసినట్లు సీఈవో గట్టు మురళి కుమార్ తెలిపారు. గురువారం మాట్లాడుతూ, సిబ్బంది ఒక రోజు వేతనం రూ.40,378 విరాళాన్ని ప్రకటించారన్నారు.

డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలి

వెల్దుర్తి, సెప్టెంబరు, 5: వెల్దుర్తిలో డిగ్రీ కళాశాల ఏర్పాటుచేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సోమన్న డిమాండ్ చేశారు. గురువారం సీపీఐ కార్యాలయంలో విద్యార్థి సంఘం నాయకులతో కలసి సమావేశం నిర్వహించారు. సమస్యల పరిష్కారం కోసం ఏఐఎస్ఎఫ్ పోరాటాలు చేసిందన్నారు. ఏఐఎస్ఎఫ్ పోరాటాల ద్వారానే వెల్దుర్తిలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పడిందన్నారు. ఈ నెల 11వ తేదిన నిర్వహించబోయే ఏఐఎస్ఎఫ్ మండల సభ జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యదర్శి కృష్ణ, రాజు, చిన్నమాదులు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

మంత్రాలయం, సెప్టెంబరు 5: వగరూరుకు చెందిన కురువ నరసన్న, పెద్ద మల్లేష్ గురువారం వేర్వేరు సమయాల్లో కర్ణాటక మద్యం తరలిస్తుండగా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సీఐ రామాంజులు, ఎస్ఐ పరమేష్ నాయక్ తెలిపన మేరకు.. పెద్దమల్లేష్ బైక్‌పై 96 కర్ణాటక టెట్రా ప్యాకెట్లను తెస్తుండగా.. సూగూరు క్రాస్ రోడ్డు, వద్ద అరెస్టు చేశారు. కురువ నరసన్నను వగరూరు గ్రామం అంగన్‌వాడీ కేంద్రం వద్ద అదుపులోకి తీసుకున్నారు. వీరివద్ద నుంచి 90 ఎంఎల్ 192 టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. బైక్ స్వాధీనం చేసుకుని ఇద్దరిని అరెస్టు చేసి కేసు నమోదు చేశారు. ఎమ్మిగనూరు కోర్టులో హాజరుపరచగా జడ్జి రిమాండ్ విధించినట్లు పోలీసులు తెలిపారు.

వీరశైవ లింగాయత్ అనుబంధ విభాగం అధ్యక్షుడిగా రుద్రగౌడ్

ఎమ్మిగనూరు, సెప్టెంబరు 5: వైసీపీ అనుబంధ వీరశైవలింగాయత్ విభాగం అధ్యక్షుడిగా ఎమ్మిగనూరుకు చెందిన వై.రుద్రగౌడ్ గురువారం నియమితులయ్యారు. ఆ పార్టీ అధినేత వైఎస్ జగన్ ఆదేశాలు జారీ చేశారు.

వరద బాధితులకు విరాళాలు

దేవనకొండ,సెప్టెంబరు 5: విజయవాడ వరద బాధితుల సహాయార్థం విరాళాలు సేకరించారు. వీబీఆర్ పాఠశాల యాజమాన్యం రూ.6 వేలు, టీడీపీ ,జనసేన అధ్వర్యంలో రూ.50 వేలు సీఎం రిలీఫ్ ఫండ్‌కు నిధులను జమ చేశారు. అపద సమయంలో చేయూతనందించి ఆదుకోవాలని టీడీపీ నాయకులు బి.రంగన్న ,వీరేష్ , మలకన్న, బండ్లయ్య, మగ్బుల్, వీబీఆర్ పాఠశాల కరస్పాండెంట్ సుభాన్ కోరారు.

పశు వ్యాధులతో అప్రమత్తం..

మద్దికెర, సెప్టెంబరు 5: పశువుల్లో వచ్చే వ్యాధుల పట్ల అప్రపమత్తంగా ఉండాలని పశువైద్యాధికారి కృష్ణ నాయక్ అన్నారు. గురువారం మదనంతపురం, బసినేపల్లి గ్రామాల్లో ఎద్దులు, ఆవులకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు వేశారు. సమస్యలొస్తే తమను సంప్రదించాలని కోరారు. సహాయకులు ప్రియదర్శిని ఉన్నారు.

తాగునీటికి పిల్లల అవస్థలు

- కోసిగి జడ్పీహెచ్‌ఎస్‌లో పనిచేయని ఆర్వో ప్లాంట్


కుళాయి వద్ద గిన్నెలు పట్టుకుని నీరు తాగుతున్న విద్యార్థులు

కోసిగి, సెప్టెంబరు 5: జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో 6 నుంచి 10వ తరగతి వరకు 1400 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. నెల నుంచి బడిలో తాగునీరు లేకపోవడంతో భోజన సమయంలో ప్లేట్లను పట్టుకుని బడి బయటకు హోటళ్ల, ఆలయం ఆవరణంలోని నీటి ట్యాంకుల దగ్గరకు పరుగులు తీస్తున్నారు. రూ.10 లక్షలతో ఆర్డీటీ మినరల్ ఆర్వో ప్లాంటను ఏర్పాటు చేసింది. పర్యవేక్షణలేక మూలనపడేశారు. విద్యాధికారులు స్పందించాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.